


మరిన్ని కథనాల కోసం యుూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్.



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 28 | కర్నూలు | గురువారం మార్చి 05 2026 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi







# మండలిని కుదిపేసిన తిరుమల లడ్డూ వ్యవహారం

**మంత్రి అచ్చన్న క్రిస్టియన్ వ్యాఖ్యలపై మండిపడ్డ వైసిపి**
**స్పీకర్ పోడియం వద్ద ఆందోళనకు దిగిన వైసిపి సభ్యులు**
**అచ్చన్న క్షమాపణలు చెప్పాలని డిమాండ్**
**స్పీకర్ మోషెన్ రాజుకు మంత్రి అచ్చన్న క్షమాపణలు**
**గందరగోళం మధ్య వాయిదా..తిరిగి నేటికి సభ వాయిదా**



అమరావతి,మార్చి4(శ్రీచక్ర) :ఏపీ శాసనమండలిలోగందరగోళ పరిస్థితి నెలకొనడంతో చైర్మన్ మోషేన్ రాజు సభను గురువారానికి వాయిదా వేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై తీవ్ర వాదోపవాదాలు నెలకొన్నాయి. ఈక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతుండగా వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. చైర్మన్ పోడియం ఎక్కి నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అంతకముందు.. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో రగడ చోటుచేసుకుంది. మాజీ సీఎం జగన్‌ను క్రిస్టియన్ అంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై వైసీపీ సభ్యులు ఆందోళకు దిగారు. దీంతో సభను ఒకసారి వాయిదా వేశారు చైర్మన్. తిరిగి మొదలైన తర్వాత కూడా.. జగన్‌కు క్షమాపణ చెప్పాలని వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'జగన్‌ను నేను క్రిస్టియన్ అని అన్నాను, ఆ మాటకు కట్టుబడి ఉన్నాను' అని స్పష్టం చేశారు. జగన్ క్రిస్టియన్ కాదని చెప్పమనండి అంటూ సవాల్ విసిరారు. 'టీవీలో చూసి ఉంటారు కదా జగన్... కాదని చెప్పమనండి' అని మంత్రి అన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కుటుంబంతో తిరుమల దర్శనానికి ఎందుకు రాలేదని నిలదీశారు. వైసీపీ సభ్యులు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. దీంతో వైసీపీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి జగన్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారం తీవ్ర వివాదంగా మారి.. పాలక, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు, విమర్శలు కొనసాగుతుండగా.. రచ్చకు దారితీసింది.. లడ్డూ అంశంపై చర్చ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్. మండలి చైర్మన్ మోషేన్ రాజు ఇద్దరు క్రిష్టియన్స్ అంటూ వ్యాఖ్యానించారు. అయితే, అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు చైర్మన్ మోషేన్‌రాజు.. తాను క్రిస్టియన్ కాదని చెప్పారు.. తాను హిందువునని తెలిపారు మండలి చైర్మన్.. అంతేకాదు.. తనను క్రిస్టియన్ గా మార్చాలని చూస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడమే కాకుండా.. అచ్చెన్నాయుడు క్షమాపణలు చెప్పాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు.. పరిస్థితి ఏర్పడింది.. ఈ సందర్భంగా మళ్లీ మాట్లాడిన మంత్రి అచ్చెన్నాయుడు.. తాను మండలి చైర్మన్ క్రిస్టియన్ అనుకున్నాను.. ఆయన తాను హిందువును అని చెప్పారు.. అందుకే నా వ్యాఖ్యలు వెనక్కు తీసుకుంటున్నాను అన్నారు.. మండలి చైర్మన్ కు తప్పు అయ్యిందని ఒప్పుకుంటున్నా అన్నారు అయినా, మండలిలో మంటలు తగ్గలేదు.. మొత్తంగా క్రిస్టియన్స్ వ్యవహారంలో మండలిలో రచ్చగా రేపగా.. మంత్రి అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నా.. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో కాసేపు శాసన మండలి వాయిదా పడింది.. ఈ సమయంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రసంగించారు. వైసీపీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రూ.320లకు కిలో ఆవు నెయ్యి ఎక్కడైనా దొరుకుతుందా?' అని ప్రశ్నించారు. వీళ్లు హిందువులు ఎలా అవుతారంటూ వైసీపీ సభ్యులను ఉద్దేశించి అన్నారు. రూ.320లకు ఆవు నెయ్యి కొనాలని అడుగుతున్న వైసీపీ సభ్యులు.. ఎమ్మెల్సీలు ఎలా అయ్యారని నిలదీశారు. సోమువీర్రాజు మాట్లాడుతున్న సమయంలో పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగడంతో సభలో గందరగోళం నెలకొంది.

# నెయ్యి కల్తీ జరిగిందని సిట్ చెప్పింది

**అయినా ఇంకా బుకాయింపులేనా**
**మండలిలో వైసిపి సభ్యుల తీరుపై మండిపడ్డ లోకేశ్**

అమరావతి,మార్చి4(శ్రీచక్ర) : దేవుడిపై తమకు అపారమైన నమ్మకం ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. దేవుడిపై నమ్మకం ఉందని డిక్లరేషన్‌పై జగన్ కనీసం సంతకం పెట్టలేదన్నారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసన మండలిలో జరిగిన చర్చలో లోకేశ్ మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్ ధర పెరిగింది. వాళ్లు చేసినట్లు మేం కూడా కల్తీ చేసిన నెయ్యి వాడాలా? లడ్డూలో కల్తీ జరిగిందా లేదా అనేది తప్ప మిగిలినవన్నీ మాట్లాడుతున్నారు. కల్తీ జరిగిందని స్పష్టంగా సీబీఐ నివేదికలో ఉంది. వైవీ సుబ్బారెడ్డి కూడా దీనిని ఒప్పుకొన్నారు. లడ్డూ కల్తీ విషయంలో తప్పు చేసిన వారిని దేవుడు వదిలిపెట్టడని లోకేశ్ అన్నారు.వేంకటేశ్వర స్వామిపై జగన్‌కు ఏమాత్రం నమ్మకం లేదని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. దేవుడిపై ఇంత కక్ష ఎందుకో వాళ్లే చెప్పాలన్నారు. ఎవరి మత విశ్వాసాలు వారివని.. తాము కాదనమని చెప్పారు. చర్చ సందర్భంగా వైసీపీ సభ్యులపై మంత్రి నారా లోకేశ్ విమర్శలు గుప్పించారు. వైసీపీ సభ్యులు చేసిన ఆరోపణలపై మంత్రి ధీటుగా సమాధానం ఇచ్చారు. 'గత పది సంవత్సరాలుగా మేము ప్రతి ఏటా మార్చి 21న మా బాబు పుట్టినరోజు సందర్భంగా తిరుమలలో అన్నదానం చేస్తాం. వైసీపీ సభ్యులు లడ్డూలో కల్తీ జరిగిందా లేదా అనే ప్రశ్న తప్ప మిగిలిన అన్నీ మాట్లాడుతున్నారు' అంటూ వ్యాఖ్యలు చేశారు. 'మార్కెట్లో నెయ్యి రేటు పెరిగింది.. మీరు చేసినట్లే 300 రూపాయలకు కొనుగోలు చేసి.. నెయ్యిని కల్తీ చేసి సప్లై చేయమంటారా' అని మంత్రి ప్రశ్నించారు. కల్తీ జరగలేదని చెప్పేందుకు వైసీపీ సభ్యులు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. తమ కుటుంబానికి దేవుడిపై అపారమైన గౌరవం ఉందని తెలిపారు. దేవుడిపై నమ్మకం ఉందని డిక్లరేషన్‌పై జగన్ కనీసం సంతకం కూడా పెట్టలేదని విమర్శించారు. 'అసలు కల్తీ జరగలేదని చెబుతారా? దేవుడు మిమ్మల్ని వదలి పెట్టడు' అంటూ మంత్రి లోకేశ్ హెచ్చరించారు.

# మోడీ పర్యటనలకు దాడులకు లింకేంటి

**యుంద్దం అన్నది మా ప్రణాళికలో భాగం**
**విమర్శలకు దీటుగా స్పందించిన ఇజ్రాయిల్**




న్యూఢిల్లీ,మార్చి4(శ్రీచక్ర) ఇరాన్ – ఇజ్రాయెల్ దేశాల మధ్య గత ఐదు రోజుల నుంచి యుద్ధం నడుస్తోంది. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తంగా ఇరాన్‌పై బాంబు దాడులు చేశాయి. ఇరాన్ నాయకులే లక్ష్యంగా టెహ్రాన్‌లోని 30 చోట్ల బాంబు దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, ఆయన భార్య, కూతురు, అల్లుడు, మనవడు ప్రాణాలు కోల్పోయారు. శనివారం జరిగిన దాడుల్లో ఖమేనీ చనిపోగా.. మరుసటి రోజు ఈ విషయాన్ని ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇజ్రాయెల్, అమెరికాలపై ప్రతి దాడులకు దిగింది. ఖమేనీ మృతి చెందినా ప్రధాని మోడీ స్పందించడం లేదని, ఖండించడం లేదని విపక్ష పార్టీలు నిలదీస్తున్నాయి. మోడీ తీరువల్ల భారత్ పరువు పోయిందని గగ్గోలు పెడుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడానికి రెండు రోజుల ముందు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఫిబ్రవరి 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు మోదీ పర్యటన సాగింది. మోదీ పర్యటన ముగిసిన సరిగ్గా రెండు రోజులకు.. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్.. ఇరాన్‌పై దాడి చేసింది. ఈ విషయం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న చర్చ, సోషల్ మీడియా ప్రచారాలపై స్పందించారు. రూవెన్ అజర్ మాట్లాడుతూ.. 'అదొక ఆపరేషనల్ అవకాశం మాత్రమే. ప్రధాని మోదీ వెళ్లిపోయిన తర్వాత ఆ అవకాశం వచ్చింది. మోదీ పర్యటన సందర్భంగా ఆయనతో దేశాభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడాము. ఈ విషయం గురించి ఆయనతో చర్చించలేదు. దాడులు చేస్తామని ఆ సమయానికి మాకు కూడా తెలీదు. మోదీ వెళ్లిపోయిన తర్వాత ఇరాన్‌పై దాడి చేయాలా? వద్దా? అన్నదానిపై నిర్ణయం తీసుకోవడానికి రెండు రోజుల సమయం పట్టింది. ఇరాన్‌పై దాడులకు ఫిబ్రవరి 28వ తేదీ ఉదయం సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆ తర్వాతే దాడులు జరిపాము. ముందు నుంచే మేము అమెరికాతో సంప్రదింపులు జరుపుతూ ఉన్నాము. సరైన సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నామని చెప్పుకొచ్చారు.మోడీ పర్యటనలో యుద్ధం గురించి ఎందుకు మాట్లాడుతామని అన్నారు.

# పిపిపి విధానంలో వైద్య కళాశాల పూర్తి

**మొత్తం వ్యయం రూ. 8,480 కోట్లు**
**అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి సత్యకుమార్ వెల్లడి**



అమరావతి,మార్చి4(ఆర్ఎన్ఎ): పది వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రెండు దశల్లో నిర్మాణం చేపడుతున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. వైసీపీ అరాచక పాలన కారణంగా సీట్ల సంఖ్య 11కి పడిపోయిందని, అయినా బెదిరింపులు ఆపడం లేదని విమర్శించారు. జగన్ ప్రైవేట్‌కళాశాలల మాదిరిగా ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు ఇచ్చారన్నారు. రాబోయే రెండేళ్లలో పీపీపీ విధానంలో కళాశాలలు పూర్తి చేస్తామని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. విరామం తర్వాత ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు బుధవారం తిరిగి ప్రారంభమయ్యాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలతో సభ కార్యకలాపాలను మొదలు పెట్టారు. ప్రైవేట్ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయడంపై తణుకు ఎమ్మెల్యే ఏ.రాధాకృష్ణ ప్రశ్న లేవనెత్తారు. వైసీపీ హయాంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రగల్భాలు పలికారని, చాలా కళాశాలల్లో పునాదులు కూడా పూర్తి కాలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం.. ప్రభుత్వ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో సీట్లు అమ్మే పద్ధతిని తెచ్చిందని.. 10 కళాశాలలను ఆరంభించి మధ్యలో వదిలేశారని విమర్శించారు. గత ప్రభుత్వం వైద్య కళాశాలల నిధులను దారి మళ్లించిందని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా బకాయిలు పెట్టిందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం (మిగతా 8 లో)

# రెవెన్యూ శాఖలో 32వేల పెండింగ్ కేసులు

**కేసుల పర్యవేక్షనకు లీగల్ సెల్ ఏర్పాటు**
**అసెంబ్లీలో మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి**



అమరావతి,మార్చి4(శ్రీచక్ర) : రెవెన్యూ శాఖలో మొత్తం 32 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పెండింగ్ కేసుల పర్యవేక్షణ కోసం లీగల్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఏపీ శాసనసభలోప్రశ్నోత్తరాలు సందర్భంగా రెవెన్యూ శాఖలో కోర్టు కేసులపై యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రశ్న లేవనెత్తారు. రెవెన్యూ శాఖలో భారీగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని.. దీంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. రెచ్చిపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరముందని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు.

# అగ్నిప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

**బహుళ అంతస్థుల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి**
**సవరణ బిల్లు ఆవశ్యకతను వివరించిన హోంమంత్రి అనిత**



అమరావతి,మార్చి4(శ్రీచక్ర) ఏపీ శాసనసభలో విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును హోంమంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు రావటంతో మార్పులు అవసరమైనట్లు చెప్పారు. ఈ సవరణ ద్వారా భవన నిర్మాణ అనుమతులను జాతీయ నిబంధనల మేరకు సవరించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అగ్నిమాపక పరికరాలు లేని భవనాలపై జరిమానాలను భారీగా పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. నిర్దేశిత కాల పరిమితి ప్రకారం అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటు న్నామని, అగ్నిమాపక పరికరాల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇచ్చేలా చట్టంలో సవరణ చేసినట్లు తెలిపారు. వాణిజ్య, పారిశ్రామిక, నివాస భవనాలకు ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరి చేస్తున్నామన్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో అత్యవసర మార్గాలు, తగిన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి అనిత పేర్కొన్నారు.

# ఏపీ అసైన్డ్ భూముల సవరణ బిల్లు–2026

**ఏపీ గ్రామ వార్డు సచివాలయాల సవరణ బిల్లు**
**రెండు కీలక బిల్లులకు శాసన మండలి ఆమోదం**

అమరావతి,మార్చి4(శ్రీచక్ర) ఏపీ శాసనసభ ఆమోదించినరెండు కీలక బిల్లులకు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఏపీ అసైన్డ్ భూముల సవరణ బిల్లు–2026 , ఏపీ గ్రామ వార్డు సచివాలయాల సవరణ బిల్లు 2026కు శాసనమండలిలో ఆమోదం లభించింది. అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లుపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సభలో మాట్లాడారు. అసైన్డ్ భూముల చట్ట సవరణకు శాసన మండలి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. గత గురువారం శాసనసభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిందన్నారు. ఈ చట్ట సవరణ ద్వారా అసైన్డ్ భూములను క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు లీజు ద్వారా కేటాయించే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు లీజు రేటు నిర్ణయించారని.. ప్రతి రెండేళ్లకు 5 శాతం వరకు లీజు మొత్తం పెంచే విధంగా సవరణ చేసినట్లు తెలిపారు. అసైనీ దారులకు ఈ లీజు ద్వారా నికరమైన ఆదాయం లభిస్తుంద న్నారు. బంజరు భూములు, చౌడు భూములుగా ఉన్న అసైన్డ్ భూములకు స్థిరమైన ఆదాయం వస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు క్లీన్ ఎనర్జీ చాలా కీలకమని మంత్రి చెప్పారు. క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు కొన్ని చోట్ల అసైన్డ్ భూములు అవసరమవుతాయని అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# అక్షరాంధ్ర ద్వారా అక్షరాస్యులు కండి

**మార్చి 15 వ తేదీన నిర్వహించబోయే 'అక్షరాంధ్ర' ఫైనల్ పరీక్షకు పరీక్షా కేంద్రాలను త్వరితగతిన గుర్తించండి:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



కర్నూలు, మార్చి 04 (శ్రీచక్ర): అక్షరాంధ్ర ద్వారా అక్షరాస్యులు కావాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పిలుపునిచ్చారు. బుధవారం వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అక్షరాంధ్ర' కార్యక్రమంలో భాగంగా కృష్ణగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అక్షరాభ్యాస శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బుధవారం నిర్వహించిన అక్షరాంధ్ర ప్రీ ఫైనల్ పరీక్షల్లో అభ్యాసకులు ఏ విధంగా రాశారని అడిగి తెలుసుకున్నారు. సాధన పుస్తకము ద్వారా అభ్యాసకులు రాసిన సమాధానాలను తెలుసుకుని, పరీక్షలు చాలా బాగా రాసారని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో వచ్చిన ఫలితాలను అన్నిటిని రేపు సాయంత్రానికి సమర్పించాలని కలెక్టర్ ఫోన్ ద్వారా డిడి అడల్ట్ ఎడ్యుకేషన్ ను ఆదేశించారు. మార్చి 15వ తేదీన నిర్వహించే ఫైనల్ పరీక్ష కూడా బాగా రాయాలని కలెక్టర్ అభ్యాసకులను కోరారు. అక్షరాంధ్ర' కార్యక్రమంలో రిజిస్టర్ అయిన అభ్యాసకులు అందరూ తప్పకుండా మార్చి 15వ తేదీ పరీక్షకు హాజరయ్యేలా చూడాలన్నారు. మార్చి 15 వ తేదీన నిర్వహించబోయే ఫైనల్ 'అక్షరాంధ్ర' పరీక్షకు ప్రతి గ్రామంలోని కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం లేదా పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా త్వరితగతిన గుర్తించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలోని కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం లేదా పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా గుర్తించి, ఇన్విజిలేటర్లుగా పాఠశాల ఉపాధ్యాయులను లేదా అంగన్‌వాడీ టీచర్లను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.భాస్కర్ రాజు, పత్తికొండ ఇంచార్జి ఆర్డీఓ కొండయ్య, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం తగదు

**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**



కర్నూలు, మార్చి 04 (శ్రీచక్ర): ఉద్యోగులు విధుల్లో అలసత్వం ప్రదర్శించడం అస్సలు సహించబోమని, విధినిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యతను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన రామలింగేశ్వర్ నగర్ 115వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతి లేకుండా అడ్మిన్ సెలవు పెట్టడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. సచివాలయంలో హాజరు రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్, టీకాల నమోదు పత్రాలు, పింఛన్ల పంపిణీ రికార్డులను పరిశీలించారు. విధుల నిమిత్తం కార్యాలయం బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా మూవెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత వాట్సాప్ గ్రూపులో లొకేషన్‌తో పాటు ఫోటోలు అప్లోడ్ చేయాలని సూచించారు. విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పింఛన్ల పంపిణీ పూర్తయ్యిన వెంటనే మిగిలిన నగదును ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలని, వ్యక్తిగత ఖాతాల ద్వారా ఎలాంటి లావాదేవీలు చేయరాదని ఆదేశించారు. సచివాలయంలో పియూపి పనులు పూర్తి చేయించుకోవాలని, శాశ్వత భవనంలో బాత్రూంలు సహా అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని, ప్రతి సేవను నిర్దిష్ట గడువులోగా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి పరిష్కరించాలని, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అమినిటీస్ కార్యదర్శి బి.ఉదయ్ కుమార్, డబ్ల్యూపిఓ కె.సుబ్రద, ఎఎన్ఎం షాహో, తదితరులు పాల్గొన్నారు.

**"అక్షర ఆంధ్ర "తో ప్రతి ఒక్కరికి విద్య..,పరీక్ష విధానాన్ని పరిశీలిస్తున్న కోట ఎంపీడీవో దిలీప్ కుమార్,ఏపీఎం అనిలా...,**

కోట : మార్చి 4 (శ్రీ చక్ర):ప్రతి ఒక్కరికి విద్య అందించాలనే లక్ష్యంతో అక్షర ఆంధ్ర కార్యక్రమం కొనసాగుతుందని కోట ఎంపీడీవో దిలీప్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఏపీఎం అనీలా ఆధ్వర్యంలో కోట మండలం నందు అక్షర ఆంధ్ర అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ ఆక్షరాంధ్ర కార్యక్రమం లో నమోదైన అభ్యాసకులకు ఉదయం 11గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష ఏర్పాటు చేశారు.ఈ ఉల్లాస్ కార్యక్రమంలో మండలంలో 2025 ఆర్థిక సంవత్సరానికి 2236మంది నిరక్షరాసులు అయినటువంటి పొదుపు మహిళలు,ఉపాధిహామి కూలీలకు వారు వ్రాయడం, లెక్కలు చూడడం,చిన్న చిన్న పదాలు చదవడం లాంటి 190 సెంటర్ల ద్వారా నిరక్షరాస్యులని అక్షరాసులుగా మార్చబడినది.కనుక వీరికి ప్రీ ఎగ్జామ్స్ నిర్వహించడం జరిగింది. మరలా ఈనెల 15వ తేదీ ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ దిలీప్ కుమార్,ఏపీఎం అనీలా తెలిపారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో దిలీప్ కుమార్,ఏపీఎం అనీలా,ఎఫ్ పీ ఓ సీసీ,సీసీ,వి ఓ ఏ,వాలంటీర్ లు హాజరైయ్యారు.



# వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలి

**టీనేజ్ ప్రెగ్నెన్సీ లను అరికట్టాలి:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**




కర్నూలు, మార్చి 04 (శ్రీచక్ర): వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వైద్య అధికారులను ఆదేశించారు. బుధవారం కృష్ణగిరి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన, టీనేజ్ ప్రెగ్నెన్సీ అరికట్టడం పై అంగన్వాడీ సిబ్బందితో, ఆశా వర్కర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యాధికారులు నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ డెంగ్యూ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు ఈ మండలం లో ఎక్కువగా నమోదు అవుతున్నందున ఈ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ సి డి సర్వేలో ప్రతి ఒక్కరికి స్క్రీనింగ్ చేయాలని, తద్వారా గుర్తించిన సస్పెక్టెడ్ కేసులకు ట్రీట్మెంట్ ఇవ్వాలన్నారు. ఈ పిహెచ్సి లో ప్రసవ శాతం తక్కువగా ఉందని, ప్రసవాలను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా మండలంలో టీనేజ్ ప్రెగ్నెన్సీ లు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు.. ఇందుకు మూల కారణంబాల్య వివాహాలని, వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్నూలు, పత్తికొండ, ఆదోని ఆర్డీఓలు, డిఎమ్హెచ్ఓ, ఐసిడిఎస్ పిడి లను ఆదేశించారు. ముమ్మరంగా అవగాహన సదస్సులను నిర్వహించి ప్రజలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల మీద అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని కలెక్టర్ కర్నూలు, ఆదోని, పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు. 8, 9, 10 వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు బాల్యవివాహాలు మరియు టీనేజ్ గర్భధారణల వల్ల కలిగే అనర్థాలను అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. ఆర్డీఓ లు పిహెచ్సిలు, అంగన్వాడీ కేంద్రాలను, వసతి గృహాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. టీనేజ్ గర్భధారణలకు పేదరికం, నిరక్షరాస్యత, గ్రామీణ ప్రాంతాల్లో సరైన సదుపాయాల లోపం, జీవన నైపుణ్యాలు (స్కిల్స్) లేకపోవడం వంటి అనేక సామాజిక-ఆర్థిక కారణాలు ప్రధానంగా ఉన్నాయని గ్రౌండ్ లెవెల్ నివేదికలు సూచిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి టీనేజ్ ప్రెగ్నెన్సీ లను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామాల్లో ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత నెలలో ఎన్ని బాల్య వివాహాలు ఆపారని కలెక్టర్ ఐసిడిఎస్ అధికారులను ఆరా తీశారు. క్షేత్ర స్థాయిలో ఏ పరిస్థితుల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయి, వాటిని ఏ నిర్మూలించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని యాక్షన్ ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.భాస్కర్ రాజు, పత్తికొండ ఇంచార్జి ఆర్డీఓ కొండయ్య, విసి ద్వారా ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, ఐసిడిఎస్ పిడి విజయ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవల్లో దూసుకెళ్తున్న జిల్ఫా దేవ్ చారిటబుల్ ట్రస్ట్







శ్రీశైలం, మార్చి 4 (శ్రీచక్ర): సుండిపెంట గ్రామ పరిధిలోని చెంచుల జీవన విధానంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో జిల్ఫా దేవ్ చారిటబుల్ ట్రస్ట్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టింది. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పీటర్ జడ్డా నేతృత్వంలో పెద్ద దోర్నాల కేంద్రంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టబోతున్నారు. నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టు పరిధిలో పడిపోయిన దేవుని సంఘాన్ని పునర్నిర్మించడంతో పాటు, అదే ప్రాంగణంలో దాతల సహకారంతో ఓల్డ్ ఏజ్ కమ్ వీడోస్ కోసం హోమ్ కేర్ సెంటర్ ను త్వరలో నిర్మించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పీటర్ జడ్డా తెలిపారు. ఇప్పటికే తమ స్వంత నిధులతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అడపాదడపా పలు చోట్ల ఓల్డ్ ఏజ్ హోమ్‌లలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చెంచు తండాలలో పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అంతేకాకుండా రోడ్ సైడ్‌లలో నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి దుప్పట్లు, ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుకు దూసుకెళ్తున్న జిల్ఫా దేవ్ చారిటబుల్ ట్రస్ట్ సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు.

# రెవెన్యూ సమస్యలను వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించాలి

**పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

కర్నూలు, మార్చి 04 (శ్రీచక్ర): జిల్లాలో ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను వేగవంతంగా మరియు నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులకు ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఆలస్యం చేయకుండా నిర్దిష్ట సమయంలో పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.బుధవారం కృష్ణగిరి మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. కార్యాలయ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పీజీఆర్ఎస్ (ఖఉఖీూ) సంబంధిత అర్జీల స్థితిగతులపై తహసీల్దార్ లాగిన్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన అర్జీల సంఖ్య, వాటి పరిష్కార స్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 43 అర్జీలు వచ్చినట్లు అధికారులు వివరించగా, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ సంబంధిత ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత ఉండాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా భూ వివాదాలు, సర్వే సంబంధిత సమస్యల పరిష్కారంలో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లే ముందు సంబంధిత రైతులకు ముందస్తుగా నోటీసులు అందజేయాలని సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత రైతులకు సర్వే రిపోర్టు అందజేయడం తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అలాగే తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కారం జరిగిన తర్వాత దాని వివరాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఒకవేళ ఏదైనా కారణాల వల్ల సమస్యను పరిష్కరించడం సాధ్యంకాకపోతే, అందుకు సంబంధించిన కారణాలను స్పష్టంగా పేర్కొంటూ ఎండార్స్‌మెంట్ జారీ చేసి అర్జీదారునికి అందజేయాలని సూచించారు. అర్జీదారు కార్యాలయానికి రాలేని పరిస్థితుల్లో వాట్సాప్ ద్వారా కూడా సమాచారం పంపే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం (పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ ) పెంపొందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీవో కొండయ్య, డిఎంహెచ్వో తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మవిశ్వాసమే విజయానికి తొలి అడుగు

**కర్నూలు అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా**




కర్నూలు స్పోర్ట్స్, మార్చి 4 (శ్రీచక్ర): అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు బుధవారం కర్నూలు పట్టణంలోని కప్పల్ నగర్ చైతన్య స్కూల్ విద్యార్థినులకు భద్రత, ఆత్మరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ఆత్మవిశ్వాసం అత్యంత ముఖ్యమన్నారు. కాన్ఫిడెన్స్ లెవెల్ పెంచుకోవాలంటే నిరంతర సాధన అవసరమని, ఏకాగ్రతతో కృషి చేస్తే లక్ష్యాలను సులభంగా సాధించవచ్చన్నారు. మనసును దృఢంగా ఉంచుకుని, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు తమపై నమ్మకం పెంచుకుంటూ ప్రతి రోజూ సాధన చేస్తే ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. బాధ్యతగల పౌరులుగా ఎదగాలని, విద్యతో పాటు మంచి నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించగల సామర్థ్యం కలవారని ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఆత్మరక్షణ విద్య ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. ఒంటరిగా ఉన్నప్పుడు లేదా ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు ఆత్మరక్షణ పద్ధతులపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి ఆత్మరక్షణ నిమిత్తం పాటించాల్సిన ముఖ్యమైన టెక్నిక్స్ విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్, కర్నూలు మహిళా పియస్ సిఐ రామయ్యనాయుడు, కర్నూలు టు టౌన్ సిఐ నాగరాజా రావు, టూ టౌన్ ఎస్సై శివాంజల్, చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ మంజుల, ఎఓ పరమేశ్వర్ రెడ్డి, కరాటే మాస్టర్స్ శ్రీనివాసులు, ఫాతిమా, చైతన్య స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## బార్ అండ్ రెస్టారెంట్ ను తొలగించాలంటూ విద్యార్థులు స్థానికులు వ్యాపారస్తులు ధర్నా



మార్కాపురం మార్చి 4 ( శ్రీ చక్ర)మార్కాపురం ప్రధాన కూడలి మార్కెట్ సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన డి.ఎస్.ఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, స్థానిక వ్యాపారులు మరియు ప్రజలు కలిసి ధర్నా చేపట్టారు. గుడి, పాఠశాలలు మరియు జనావాసాల మధ్య బార్ ఏర్పాటు చేయడం సరైంది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో రోజూ విద్యార్థులు, మహిళలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు చేస్తారని తెలిపారు. పాఠశాలలకు వెళ్లే ప్రధాన రహదారిలో బార్ ఉండటం అనుచితమని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దుకాణాన్ని తొలగించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వేదికపై మార్కాపురం జిల్లా శాస్త్రవేత్త కు విశిష్ట గౌరవం


### తర్లుపాడు ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసిన....డాక్టర్ బాసు వెంకటేశ్వర రెడ్డి



మార్కాపురం. మార్చి 4 (శ్రీ చక్ర)మార్కాపురం జిల్లాకు తర్లుపాడుకు చెందిన ప్రముఖ ఔషధ శాస్త్రవేత్త డాక్టర్ బాసు వెంకటేశ్వర రెడ్డి అంతర్జాతీయ వేదికపై మరోసారి తన ప్రతిభను చాటుకుని జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలిచారు. ప్రస్తుతం కె.వి. కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఆయన, నానో సాంకేతికత ఆధారిత నూతన ఔషధ పంపిణీ విధానాలపై విశేష పరిశోధనలుచేస్తున్నారు.ఔషధాలను లక్ష్యిత అవయవాలకు సమర్థవంతంగా చేరే విధంగా రూపొందించే ఆధునిక సాంకేతిక పద్ధతులపై ఆయన చేస్తున్న పరిశోధనలు వైద్యరంగంలోవిశేషప్రాధాన్యతనుసంతరించుకున్నాయి. ఇప్పటివరకు 140 కు పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా వ్యాసాలను ప్రచురించిన ఆయన, తొమ్మిది ప్రామాణిక గ్రంథాలను కూడా రచించారు.భారతదేశం మరియు యునైటెడ్ కింగ్‌డమ్ దేశాల్లో కలిపిపదహారు పైగా పేటెంట్లు నమోదు చేయడం ఆయన ప్రతిభకు నిదర్శనం.ఎమ్.ఎ.హ్యూమన్ రైట్స్, ఎమ్. బి. ఏ, ఔషధ శాస్త్రంలో డాక్టరేట్ వంటి ఉన్నత విద్యార్హతలు కలిగిన ఆయన "ఫార్మాస్యూటిక్స్?ఒకటి" గ్రంథ రచయితగా విద్యార్థుల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. అంతర్జాతీయ ఔషధ సదస్సుల్లో ప్రశంసలుఅందుకుంటూ యువశాస్త్రవేత్తలకు స్ఫూర్తిగా నిలుస్తు న్నారు. డాక్టర్ బాసు వెంకటేశ్వర రెడ్డి మార్కాపురం జిల్లా తర్లుపాడు గ్రామా నికి చెందిన కావడం ఈ ప్రాంత వాసులకు గర్వకారణం అని కొనియాడారు.

## ప్రఖ్యాత ఆధ్యాత్మిక శైవక్షేత్రం శ్రీశైల మహాక్షేత్రానికి రైల్వే లైన్ శుభ శుభ పరిణామంప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపినబిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి

రామచంద్రారెడ్డి మార్కాపురం మార్చి4( శ్రీ చక్ర)మార్కాపురం.హైదరాబాద్ నుంచి శ్రీశైలం శ్రీశైలం నుంచి మార్కాపురం వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నారని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్ర రెడ్డి బుధవారం న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి నేత మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి, ఫైనల్ సర్వే రిపోర్ట్ ఆధారంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించి రైల్వే లైన్ ఏర్పాటు విషయంపై నిర్ణయం తీసుకునేందుకు చర్యలు ప్రారంభించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల శ్రీశైలంసందర్శించిన అనంతరం ఈ శుభవార్త రావడం ఈ ప్రాంతప్రజలకేకాకదేశవ్యాప్తంగా ఉన్న భక్తులకు కూడా ఎంతో సంతోషదాయకం.ఈ సందర్భంగా ఈ ప్రాజెక్టుపై సానుకూలంగా స్పందించి ముందుకు తీసుకెళ్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు వీవీఎన్ మాధవ్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.అదే సమయంలో శ్రీశైలం రైల్వే లైన్ త్వరగా కార్యరూపం దాల్చి,భక్తులకు సౌకర్యం కలిగించడంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు..




# పార్టీ శిక్షణా తరగతులకు మంగళగిరికి బయలుదేరిన టీడీపీ శ్రేణులు.

### జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించిన సత్యం.





రామచంద్రపురం, మార్చి 4 (శ్రీచక్ర)మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 5, 6 తేదీలలో నిర్వహించనున్న శిక్షణా తరగతులకు రామచంద్రపురం నియోజకవర్గం నుంచి పలువురు టిడిపి నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిలు బయలుదేరి వెళ్లే వాహనాన్ని వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, పార్టీ బలోపేతం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపు, ప్రభుత్వ పథకాలపై స్పష్టమైన అవగాహన, ప్రజలతో మరింత సాన్నిహిత్యం పెంచడం లక్ష్యంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక రాజకీయ పరిస్థితుల్లో సోషల్ మీడియా వినియోగం, బూత్ స్థాయి బలోపేతం, ఎన్నికల వ్యూహాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం వంటి అంశాలపై ప్రత్యేక మార్గదర్శకాలు అందజేయబడతాయని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రతి గ్రామం, ప్రతి వార్డుకు చేర్చే బాధ్యత క్లస్టర్ ఇన్చార్జిలదేనని, శిక్షణ ద్వారా వారికి మరింత స్పష్టత, ధైర్యం, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు.ఈకార్యక్రమంలో నాయకులు మేడిశెట్టి సూర్యనారాయణ,కంచుమర్తి బాబురావు,పెంకె సాంబశివరావుచెల్లి గోపాలకృష్ణపలివెల ప్రకాష్,వనుం వీరబ్రహ్మం,పలివెల రాజు,సలాది సాయిబాబా,సలాది పట్టాభిరామయ్య,మరివాడ సూరిబాబు, ఉండవల్లి శివ, చందమామ వాసు, కవల నానాజీ, గేదల దొరబాబు తదితరులు పాల్గొన్నారు..

# శాసనమండలిలో క్రిస్టియన్ అంశంపై దుమారం

### క్షమాపణ చెప్పిన అచ్చెన్న - అసలేం జరిగిందంటే?

విజయవాడ, మార్చి 4ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై జరిగిన చర్చ తీవ్ర ఉత్కంఠకు, అనూహ్య పరిణామాలకు దారితీసింది. శాసన మండలిలో కల్తీ నెయ్యి అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో మంత్రి అచ్చెన్నాయుడు వైసీపీ సభ్యుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో జరుగుతున్న చర్చను వైసీపీ సభ్యులు అడ్డుకోవడంపై ఆయన ఆవేదన చెందారు. తాను ఇక్కడ మంత్రిగా కంటే, ఒక సామాన్య వేంకటేశ్వర స్వామి భక్తునిగా మాట్లాడుతున్నానని, కోట్ల మంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ అంశాన్ని రాజకీయం చేయడం తగదని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇతర మతాలను గౌరవించాలని హితవు పలికారు. నేను హిందువును, జగన్ మోహన్ రెడ్డి , చైర్మన్ మోషేన్ రాజు క్రిస్టియన్లు.. ఎవరి మతం వారి ఇష్టం, ఎవరైనా ఏ మతాన్నైనా అనుసరించవచ్చు అని వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యాఖ్యలు సభలో ఒక్కసారిగా కలకలం రేపాయి. తనను క్రిస్టియన్‌గా అభివర్ణించడంపై మండలి చైర్మన్ మోషేన్ రాజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి వ్యాఖ్యలకు స్పందించిన చైర్మన్ మోషేన్ రాజు తాను క్రిస్టియన్‌ను కాదని, హిందువునని సభలో స్పష్టమైన ప్రకటన చేశారు. తన పేరులో మోషేన్ ఉన్నంత మాత్రాన మతం మార్చుకున్నట్టు కాదని ఆయన వివరించారు. చైర్మన్ నుంచి వచ్చిన ఈ స్పష్టీకరణతో మంత్రి అచ్చెన్నాయుడు వెంటనే స్పందించి, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. తెలియక చేసిన పొరపాటుగా భావించాలని కోరారు. మంత్రి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నప్పటికీ, వైసీపీ సభ్యులు సభలో గందరగోళం సృష్టించడం ఆపలేదు. అచ్చెన్నాయుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. చైర్మన్ మోషేన్ రాజు వైసీపీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వివరణతో తాను సంతృప్తి చెందానని, వ్యక్తిగతంగా తనకే లేని అభ్యంతరం మీకు ఎందుకని ఆయన వైసీపీ సభ్యులనే ప్రశ్నించారు. అయినా వైసీపీ సభ్యులు ఆందోళనలు కొనసాగించారు. లడ్డూ కల్తీపై జరగాల్సిన చర్చ కాస్తా మతపరమైన అంశాల చుట్టూ తిరగడం సభలో చర్చనీయాంశమైంది. అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవడం, చైర్మన్ స్వయంగా జోక్యం చేసుకుని సభ్యులను వారించడంతో గొడవ సద్దుమణిగింది.

# ఫ్యామిలీ మ్యాన్ నుంచి పొలిటిషియన్...



చెన్నై, మార్చి4,(న్యూస్ పల్స్)తమిళ స్టార్ హీరో, 'తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత దళపతి విజయ్ ప్రస్తుతం తన జీవితంలో అత్యంత క్లిష్టమైన దశను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు రాజకీయాల్లోకి అడుగుపెట్టి 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా దూసుకుపోతుంటే, మరోవైపు 26 ఏళ్ల వైవాహిక బంధం ముగింపు దశకు చేరుకోవడం ఆయన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్టపై తీవ్ర చర్చకు దారితీసింది.ఫిబ్రవరి 27న విజయ్ భార్య సంగీత స్వర్ణలింగం చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేయడం కోలీవుడ్‌లో సంచలనం సృష్టించింది. 1999లో ప్రేమ వివాహం చేసుకున్న ఈ జంటకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సంగీత తన పిటిషన్‌లో చేసిన ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. విజయ్ ఒక ప్రముఖ నటితో (త్రిష అని పుకార్లు వినిపిస్తున్నప్పటికీ పిటిషన్‌లో పేరు స్పష్టంగా లేదు) 2021 నుండి సంబంధం కలిగి ఉన్నారని సంగీత ఆరోపించారు. విజయ్ తనను సామాజికంగా, వృత్తిపరంగా దూరం పెట్టారని, ఆమె స్వేచ్ఛపై ఆర్థిక ఆంక్షలు విధించారని ఆమె ఆరోపించారు. సదరు నటి విజయ్‌తో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నా ఆయన ఖండించలేదని, ఇది తనను, పిల్లలను తీవ్ర అవమానానికి గురిచేసిందని ఆమె పేర్కొన్నారు.విజయ్ తన పార్టీ టీవీకేను స్థాపించి, సినిమాలకు స్వస్తి పలికి పూర్తిస్థాయి రాజకీయ నేతగా అవతరించాలని నిర్ణయించుకున్నారు. సరిగ్గా 2026 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ విడాకుల వ్యవహారం బయటకు రావడం ఆయనకు రాజకీయంగా పెద్ద దెబ్బ. విజయ్ ఇప్పటివరకు ఒక 'ఫ్యామిలీ మ్యాన్'గా, బాధ్యతాయుతమైన వ్యక్తిగా తన ఇమేజ్‌ను కాపాడుకుంటూ వచ్చారు. విడాకుల పిటిషన్‌లో నైతికతకు సంబంధించిన ఆరోపణలు రావడంతో ప్రత్యర్థి పార్టీలకు ఇది ఒక ఆయుధంగా మారే అవకాశం ఉంది. రాజకీయాల్లో మహిళా ఓటర్ల మద్దతు చాలా ముఖ్యం. భార్యను నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు మహిళా ఓటర్లలో ఆయనపై ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించవచ్చు.రాజకీయాలతో పాటు సినిమా పరంగా కూడా విజయ్ ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఆయన చివరి చిత్రంగా భావిస్తున్న 'జన నాయకన్' సెన్సార్ పరంగా ఆటంకాలను ఎదుర్కొంటోంది. రాజకీయ సందేశాలు ఉండటంతో సెన్సార్ బోర్డు అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. పొంగల్ కు విడుదల కావాల్సిన ఈ సినిమా ఇప్పటివంకూ రిలీజ్ కాలేదు. అటు వ్యక్తిగత జీవితం, ఇటు కెరీర్ రెండూ డైలమాలో పడ్డాయి _ విమర్శలు రావడం కొత్తేమీ కాదు. గతంలో ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి వంటి నేతలు కూడా ఇలాంటి వ్యక్తిగత విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే విజయ్ ఇప్పుడు ఏ పరిస్థితుల్లో ఉన్నారనేది ముఖ్యం. విజయ్ అభిమానులు, యువత దీన్ని ఆయన వ్యక్తిగత విషయంగా చూస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్..రాష్ట్ర.రజక.సమ్మేళనా ము ప్రత్యేక సమావేశం



మార్కాపురం మార్చి 4(శ్రీ చక్ర)మార్కాపురం విజయవాడ లోప్రత్యేక సమావేశం రైల్వే స్టేషన్ దగ్గరలో ఉన్న సాయితేజ ఫంక్షన్ హాలు, శంకర్మఠందగ్గర ,హనుమాన్ పేట" లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సమ్మేళనము అనే ప్రత్యేక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 28 జిల్లాలకు సంబంధించిన రజక నాయకులు, రజక వివిధ డిపార్ట్మెంట్స్ కి సంబంధించినప్రభుత్వఉద్యోగులు / ప్రైవేటు ఉద్యోగులు , రజక కమ్యూనిటీకి చెందినవారు , మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఇబ్బందులను , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వనీ దృష్టికి తీసుకొనివెళ్లి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని ఆవిధంగా ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకుంటామని రజక విద్యా సేవా సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ ఓ తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు శ్రీ దేవలూటి శంకర్ " ఒక ప్రకటనలో తెలియజేశారుఆయనతోపాటు రజక విద్యా సేవా సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ గౌరవ సలహాదారు లు పొనుగుపాటి శ్రీనివాసరావు , మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా సలహాదారులు ముత్తుకూరు చిరంజీవి కూడా ఉన్నారు..ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డిజిపి పూర్ణచంద్రరావు కూడా హాజరుకానున్నారు

## వివాహ మహోత్సవ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే జంకె



మార్కాపురం మార్చి 4 ( శ్రీ చక్ర)మార్కాపురం మండలంలోని బోడిచెర్ల గ్రామంలో నూనె వివాహనికి హాజరై కుమారి కల్పన ను అశ్వీరదించిన ఏపీఐఐసీ మాజీ చైర్మన్ నెల్లూరు పార్లమెంట్ వైఎస్ఆర్ సీపీ పరిశీలకులు మార్కాపురం మాజీ శాసనసభ్యులు జంకె వెంకటరెడ్డి ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మైనార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మొహిద్దిన్ పంపి వెంకటరెడ్డి పలువురు పాల్గొన్నారు

## గోనుగుంట్ల కోటేశ్వరరావు మృతికి నివాళులు అర్పించిన మాజి ఎమ్మెల్యే అన్నా



మార్కాపురం మార్చి 4 (శ్రీ చక్ర)మార్కాపురం పట్టణంలోని గోకుల్ అపార్ట్మెంట్ నందు గోనుగుంట్ల కోటేశ్వరరావు గమృతి చెందగా విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు గారు కోటేశ్వరరావు పార్థీవదేహానికి పూలమాలవేసినివాళులర్పించారు.

## ఏపీయూడబ్ల్యూజే,ఐజేయు ప్లీనరీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

తుగ్గలి:ఈనెల 14,15,16వ తేదీలలో వరుసగా మూడు రోజులు పాటు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పాత్రికేయులకు సంబంధించి ఏపీయూడబ్ల్యూజే,ఐజేయు ప్లీనరీ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని,ఈ మహాసభలలో ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్ట్ యూనియన్ కు సంబంధించిన పాత్రికేయ మిత్రులందరు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీయూడబ్ల్యూజే మండల గౌరవ అధ్యక్షుడు మురళీమోహన్ రెడ్డి,అధ్యక్షుడు విజయ్, కార్యదర్శి ఇమాములు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం రోజున వారు మాట్లాడుతూ జర్నలిస్టు మిత్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐజేయు ప్లీనరీ రాష్ట్ర మహాసభలలో అన్ని విషయాలపై సుదీర్ఘంగా చర్చించడం జరుగుతుందని,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని,అలాగే దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన పాత్రికేయ సంఘాలకు సంబంధించిన కీలక నేతలు కూడా హాజరవుతారన్నారు.తద్వారా పాత్రికేయ మిత్రులు ఏపీయూడబ్ల్యూజే,ఐజేయు రాష్ట్ర మహాసభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఉగాదికి ఏం జరగుతుంది...


విజయవాడ, మార్చి 4, ఏపీలో కూటమి ప్రభుత్వం కొత్త నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న తరుణంలో సమూల మార్పులు తీసుకురావాలని భావిస్తోంది. ముఖ్యంగా పాలనలో విప్లవాత్మక మార్పులు ప్రారంభించాలని చూస్తోంది. అందులో భాగంగా ఒక కొత్త మంత్రిత్వ శాఖను తెరపైకి తెస్తోంది. సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అనే కొత్త శాఖ రానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ శాఖ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దగ్గరే ఉంది. అయితే దీని పేరిట ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి ఒక మంత్రికి బాధ్యతలు కట్టబెట్టె అవకాశం ఉంది. అయితే ఈ ఒక్క శాఖ కోసం మంత్రివర్గ విస్తరణ చేపడతారా? లేకుంటే భారీ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. రేపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ ఉంది. ఈ సమావేశంలో మంత్రివర్గ విస్తరణకు సంబంధించి కీలక నిర్ణయం దిశగా అడుగులు వేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి ఉగాది నాటికి మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. మార్చి 7 వరకు కొనసాగనున్నాయి. తరువాత మంత్రివర్గ విస్తరణ పై ఒక క్లారిటీ రానుంది. కానీ అసెంబ్లీ లాబీల తో పాటు ఎమ్మెల్యేలు ఒకచోటకు చేరే క్రమంలో దీనిపైనే చర్చ నడుస్తోంది. ప్రముఖంగా ఓ ఐదుగురు పేర్లు వినిపిస్తున్నాయి. అయితే సమూల ప్రక్షాళన ఉంటుందన్న ప్రచారం మాత్రం నడుస్తోంది. టిడిపి నుంచి చాలామంది మంత్రులను తొలగించి కొత్త వారికి అవకాశం ఇస్తారని తెలుస్తోంది. అయితే ఇప్పటికే మెగా బ్రదర్ నాగబాబు కు మంత్రి పదవి ఖాయమని ఏనాడో తేలిపోయింది. అయితే కొత్తగా ఏర్పాటు చేసే సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ శాఖను ఆయనకు అప్పగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమావేశం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. హోలీ రోజున ఈ ఇద్దరు లంచ్ మీటింగ్ ఏర్పాటు చేసుకోవడానికి గల కారణాలపై అనేక రకాలుగా చర్చ జరుగుతుంది. కేవలం నామినేటెడ్ పోస్టులు, పాలనాపరమైన విషయాలపై చర్చించడానికి ఈ భేటీ జరిగిందని ఎవరూ అనుకోవడం లేదు. బలమైన కారణం ఉంటుందనే భావిస్తున్నారు. తిరుమల లడ్డూ వ్యవహారం ప్రధానంగా కూటమి ప్రభుత్వానికి ఇబ్బందిగా మారిందని సొంత పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. అనవసరంగా లడ్డూను పొడిగించి దానిని తెగే వరకూ టీడీపీ నాయకత్వమే లాగుతున్నారని సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.దీనికి తోడు తాజాగా తిరుమలకు సంబంధించిన అనేక విషయాలు సోషల్ మీడియాలో నెట్టింట్ కనిపించడం, దానిపై ఎవరూ ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో అది కూడా తమ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని భావిస్తున్నారు. అందుకోసమే ప్రధానంగా ఈ సమావేశం జరుగుతుందని తెలిసింది. ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తారని, ప్రజల్లోకి మాత్రం కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందన్న అభిప్రాయం కూడా నేతల్లో కలుగుతుంది. అనవసరంగా రాద్ధాంతం చేయకుండా దీనికి ఫుల్ స్టాప్ ఎలా పెట్టాలి? ఎండ్ కు ఎలా తీసుకెళ్లాలన్న దానిపైనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల మధ్య చర్చ జరిగే అవకాశముందని పార్టీ నేతలు చెబుతున్నారు.కూటమిలోని టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు చాలా జాగ్రత్తగా ఉండాలని, ప్రధానంగా వివాహేతర సంబంధాల విషయాలు కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బందికరంగా మారాయి. ఇటీవల రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ను లక్ష్యంగా చేసుకోవడంతో పాటు తాజాగా మరొక దేవస్థానం కమిటీ ఛైర్మన్ పై కూడా ఆరోపణలు చేయడం పార్టీ ప్రతిష్ట మంటగలుస్తుందని, ఇటువంటి విషయాలు ప్రజల్లోకి వేగంగా, తొందరగా చొచ్చుకు వెళతాయని అందుకే దీనిపై ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై పవన్, చంద్రబాబు నాయుడులు చర్చించినట్లు సమాచారం. అయితే యాక్షన్ తీసుకుంటే ఎలా ఉంటుంది? తీసుకోకుండా దీనిపై ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై కూడా చర్చ నడిచినట్లు విశ్వసనీయ సమాచారం. కూటమిలో బీజేపీ నేతల జోలికి వెళ్లే ధైర్యం లేక, జనసేన, టీడీపీ నేతలనే వైసీపీ లక్ష్యంగా చేసుకుందన్న అభిప్రాయం కూడా ఈ భేటీలో వ్యక్తమయినట్లు తెలిసింది

# రంగంలోకి దిగిన ఏకసభ్య కమిషన్

తిరుమల, మార్చి 4, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ వ్యవహారంపై మరింత లోతైన విచారణ కోసం, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడటం కోసం విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఇప్పుడు తన విచారణను వేగవంతం చేసింది.తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి సరఫరా అయిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందన్న నివేదిక బయటకు రావడంతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఈ అంశంపై ఇప్పటికే సిట్, సిబిఐ విచారణలు చేశాయి. వాటిని ఆధారంగా చేసుకుని గత ప్రభుత్వ హయాంలో నెయ్యి సేకరణ విధానాలు, టెండర్ల ప్రక్రియ, నాణ్యత పరీక్షల్లో జరిగిన లోపాలను వెలికితీయడానికి ప్రభుత్వం దినేష్ కుమార్ కమిషన్‌ను నియమించింది.దినేష్ కుమార్ కమిషన్ కేవలం కల్తీ జరిగిందా లేదా అని తేల్చడానికే పరిమితం కాకుండా, వ్యవస్థాగత మార్పులపై దృష్టి సారించనుంది. తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేసేందుకు కంపెనీలు ఎలా ముందుకు వచ్చాయి? నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అన్నది పరిశీలిస్తుంది.టీటీడీ ల్యాబ్‌లలో పరీక్షలు ఎందుకు విఫలమయ్యాయి? సరఫరాదారులు పంపిన నమూనాలను నిశితంగా ఎందుకు పరిశీలించలేదు? లాంటి అనేక అంశాలను సమీక్షిస్తుంది. గత బోర్డు నిర్ణయాల్లో రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా అన్న కోణంతో పాటు భవిష్యత్తులో నెయ్యి సేకరణ ఎలా ఉండాలి? స్వచ్ఛమైన ఆవు నెయ్యిని సేకరించేందుకు అత్యుత్తమ మార్గాలేవి? అనే అంశాలపై నివేదిక ఇవ్వనుంది.కమిషన్ ఇప్పటికే తన కార్యకలాపాలను ప్రారంభించింది. తిరుమల చేరుకున్న దినేష్ కుమార్, నెయ్యి ట్యాంకర్ల రికార్డులు, మార్కెటింగ్ విభాగం ఫైళ్లను కమిషన్ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత ఐదేళ్లలో నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్ల వివరాలు, వారి అర్హతలు, అప్పట్లో టీటీడీ అధికారులు తీసుకున్న నిర్ణయాలపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా, రివర్స్ టెండరింగ్ పేరుతో నాణ్యతను పక్కన పెట్టి ధరకే ప్రాధాన్యత ఇవ్వడం వల్లనే ఈ సమస్య తలెత్తిందా అన్నది కమిషన్ ప్రధానంగా విశ్లేషిస్తోంది.ఈ కమిషన్ ఏర్పాటుపై ప్రతిపక్షాల నుండి కొన్ని విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికే సిట్ విచారణ జరుగుతుండగా, మళ్లీ ఐఏఎస్ కమిషన్ అవసరమా అన్నది వారి ప్రశ్న. అయితే, సిట్ అనేది క్రిమినల్ కోణంలో ఎవరు నేరం చేశారనేది విచారిస్తుంది, కానీ దినేష్ కుమార్ కమిషన్ పరిపాలనాపరమైన లోపాలను సరిదిద్దడానికి ఉద్దేశించినదని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.దినేష్ కుమార్ కమిషన్ ఇచ్చే నివేదిక టీటీడీ చరిత్రలో అత్యంత కీలకం కానుంది. కేవలం నిందితులను శిక్షించడమే కాకుండా, రాబోయే రోజుల్లో తిరుమలకు నెయ్యి సరఫరా చేసే కంపెనీలకు కఠినమైన నిబంధనలు, అత్యాధునిక ల్యాబ్ పరీక్షలు, పారదర్శకమైన సేకరణ విధానాలను ఈ కమిషన్ సూచించనుంది. ఈ విచారణ ద్వారా వాస్తవాలు బయటకు వచ్చి, శ్రీవారి ప్రసాదానికి మళ్లీ పూర్వ వైభవం లభిస్తుందని భక్తులు ఆశిస్తున్నారు

# తమిళనాడుపై రోజా ఫోకస్



తిరుపతి, మార్చి 4, ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు పొందిన రోజా ఇప్పుడు తమిళంపై ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తున్నారు. ముఖ్యంగా అక్కడి డీఎంకే అధినేత స్టాలిన్ పుట్టినరోజు వేడుకలకు హాజరై సందడి చేశారు రోజా. డీఎంకేకు మద్దతుగా తన గళం వినిపించారు. సమాజంలో మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న స్టాలిన్ సర్కార్ ను మరోసారి ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారుస్టాలిన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను రోజా ఆకాశానికెత్తారు. ముఖ్యంగా తమిళనాడులో మహిళల ఆర్థిక భద్రత కోసం ప్రతినెలా వారి ఖాతాల్లో నేరుగా వెయ్యి రూపాయలు జమ చేయడం వంటి పథకాలు మహిళా సాధికారతకు నిదర్శనమని ఆమె కొనియాడారు. ఇదే తరుణంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏపీలో మహిళలకు నేరుగా నగదు అందిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు.తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని రోజా వ్యాఖ్యానించారు. ఇటీవల మహిళల ఖాతాల్లో ఒకేసారి ఐదు వేల రూపాయలు జమ చేయడంతో విపక్ష నేతలకు ఏం చేయాలో పాలుపోవడం లేదని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని తాను పూర్తిస్థాయిలో సమర్థిస్తున్నానని, దీనివల్ల కూలి పనులకు వెళ్లే పేద మహిళలకు, విద్యార్థులకు ఎంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇంతటి గొప్ప మనసున్న నాయకుడిని తమిళ ప్రజలు భారీ మెజారిటీతో మళ్లీ గెలిపించుకోవాలని, సంక్షేమ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధికి ప్రతిఫలంగా స్టాలిన్‌కు ఓటు వేసి రుణం తీర్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఒకవైపు ఏపీ రాజకీయాల్లో చురుగ్గా ఉంటూనే, తమిళ గడ్డపై డీఎంకే తరపున రోజా గళం విప్పడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.యస్సార్ కాంగ్రెస్ పార్టీ తమిళనాడు ఎన్నికల్లో స్టాలిన్ పార్టీకి మద్దతుగా నిలవాలని చూస్తోంది. ఎందుకంటే తమిళనాడులో తెలుగు ప్రజలు అధికం. ఆపై రాయలసీమకు దగ్గరగా ఉ ంటుంది తమిళనాడు. ఈ క్రమంలో మరికొద్ది రోజుల్లో జరిగే ఎన్నికల్లో స్టాలిన్ పార్టీ గెలవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా కోరుకుంటుంది. కరుణానిధి ఉండే సమయంలో చంద్రబాబుతో ఆయనకు మంచి సంబంధాలు ఉండేవి. స్టాలిన్ విషయానికి వస్తే చంద్రబాబుతో మంచి సంబంధాలే కానీ.. కేంద్రంలో బిజెపితో టిడిపి ఉండడంతో స్టాలిన్ స్నేహానికి అడ్డంకిగా మారింది. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డితో మంచి సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారు స్టాలిన్. ఈ నేపథ్యంలో తమిళనాడు ఎన్నికల్లో స్టాలిన్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు సమాచారం.బలం పెంచుకోవాలనుకుంటున్న బిజెపి.. తమిళనాడులో బలం పెంచుకోవాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు షేర్ పెరిగింది ఆ పార్టీకి. సీట్ల పరంగా ఒక్కటి కూడా రాకపోయినా ఓట్ల పరంగా మాత్రం మెరుగుపడింది. అందుకే ఈసారి మిత్రులతో ముందుకు సాగాలని నిర్ణయించింది. ఎట్టి పరిస్థితుల్లో అధికార పార్టీకి ధీటుగా నిలబడాలని చూస్తోంది. ఏ అవకాశాన్ని జారవిడుచుకోవడం లేదు.. ఇటువంటి పరిస్థితుల్లో ఆచితూచి వ్యవహరిస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఏపీలో కూటమిపై విమర్శలు చేస్తుందే తప్ప.. కేంద్ర బిజెపిని పల్లెత్తు మాట అనడం లేదు. అయితే ఇప్పుడు తమిళనాడులో వైసిపి తీసుకున్న స్టాండ్ తో బిజెపి ఎలాంటి చర్యలకు దిగుతుందో చూడాలి. అయితే ఇప్పటివరకు కేంద్ర బిజెపి విషయంలో వైసీపీ సానుకూల నిర్ణయాలు తీసుకుంటూ వస్తోంది. లోక్సభ స్పీకర్ ఎంపిక నుంచి పార్లమెంట్లో ప్రవేశపెట్టి పలు బిల్లుల వరకు మద్దతు తెలిపింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అటువంటిది తమిళనాడులో డీఎంకే కూటమికి మద్దతు అంటే సాహసంతో కూడుకున్న పని. అయితే అది రోజా స్వయంగా తీసుకున్న నిర్ణయమా? పార్టీ తీసుకున్న నిర్ణయమా? అన్నది తెలియాల్సి ఉంది. ఒకవేళ రోజా సొంతంగా నిర్ణయం తీసుకుంటే మాత్రం వైసీపీని ఇరకాటంలో పెట్టినట్టే..

# అప్పలరాజుకు దూరమౌతున్న కేడర్

శ్రీకాకుళం, మార్చి 4,మాజీమంత్రి సీదిరి అప్పలరాజుకు.. ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ అని పేరు. 2019లో పలాస నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినా.. జగన్ కేబినెట్‌లో కీలక శాఖ దక్కించుకున్నారు. అప్పట్లో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలోనూ పదవి నిలబెట్టుకున్నారు. జగన్‌కి నమ్మినబంటులా ఉంటూ వస్తున్న ఆయన.. అధినేతపై ఎవరు విమర్శలు చేసినా.. వెంటనే కౌంటర్ ఎటాక్ చేస్తుంటారు. అలాంటి నాయకుడిపై ఇప్పుడు సొంత పార్టీలోనే ఇబ్బందులు ఎదురవతున్నాయా అనే ప్రచారం జరుగుతోంది. పార్టీలో లుకలుకలతో ఆయన సర్దుబాటు కావడం లేదట. అసమ్మతి నేతలు ఆయనకు మరింత తలపోటుగా మారారనే గుసగుసలు వినిపిస్తున్నాయ్.తన గెలుపులో కీలకంగా వ్యవహరించిన నేతలను.. సీదిరి పక్కన పెట్టారనే చర్చ ఎప్పటి నుంచో వినిపిస్తోంది. ఓ కోటరీని నమ్ముకొని.. దాని మధ్యలోనే ఉ ండిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయ్. దువ్వాడ శ్రీకాంత్‌తో పాటు.. దువ్వాడ హేంబాబు చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు లాంటి సీనియర్ నేతలు.. వైసీపీని విడిచి వెళ్లిపోయింది కూడా సీదిరి తీరు నచ్చకే అనే చర్చ కూడా జరుగుతోంది. ఐతే ఈ ప్రభావం గత ఎన్నికల్లోనూ కనిపించింది.సీదిరి. ఐతే ఓటమి తర్వాత కూడా ఆయనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని.. పలాస నేతల్లో చర్చ జరుగుతోంది.రాష్ట్ర రాజకీయాలపై ఎప్పటికప్పుడు స్పందించే సీదిరి.. నియోజకవర్గంలో మాత్రం పార్టీని పట్టించుకోవడం లేదని.. తన చుట్టూ ఉన్న వారితోనే పార్టీని నడపాలని చూస్తున్నారని ఫ్యాన్ పార్టీ నేతల్లో ఆగ్రహం కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీలో కీలకంగా ఉన్న ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ బల్లగిరిబాబు, మరో సీనియర్ నేత దువ్వాడ శ్రీధర్ కూడా తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఇలా సీదిరి తీరు నచ్చక.. నేతలంతా ఒక్కొక్కరిగా దూరం అవుతున్నారనే గుసగుసలు పలాసలో జోరుగా వినిపిస్తున్నాయ్. పార్టీ కోసం కష్టపడే వారిని.. సీదిరి అప్పలరాజు కనీసం పట్టించుకోవడం లేదంటూ.. వైసీపీ కార్యకర్తలు బహిరంగంగానే విమర్శలు గుప్పించే పరిస్థితులు కనిపిస్తున్నాయనే టాక్ నడుస్తోంది.వైసీపీలో కీలక నేతగా ఉన్న దువ్వాడ శ్రీధర్.. సీదిరికి వ్యతిరేకంగా ఓ గ్రూప్ క్రియేట్ చేస్తున్నారు. పలాస ఉద్యమాన్ని ఎత్తుకున్నారు. పలాసను జిల్లా చేయాలంటూ జేఏసీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవన్నీ.. మాజీమంత్రి సీదిరి అప్పలరాజుకు తలపోటుగా మారాయనే చర్చ జరుగుతోంది. అటు పార్టీ అసలే కష్ట కాలంలో ఉంది. ఇలాంటి సమయంలో నేతలంతా ఒక్కొక్కరుగా దూరం అవుతుండడంతో.. కేడర్ కూడా డీలా పడిపోతోందట. సీదిరి దూకుడు రాజకీయాలతో.. అసలుకే మోసం వస్తుందని.. కార్యకర్తలు వాళ్లలో వాళ్లు చర్చించుకున్నారని తెలుస్తోంది. పార్టీలో గ్రూప్‌ల గోల ఎక్కువ అయితే.. ఎన్నికల నాటికి మరింత ఇబ్బంది అవుతుందని.. అందరిని కలుపుకొని వెళ్లినప్పుడే రాజకీయంగా గౌతు కుటుంబాన్ని ఢీకొట్టే అవకాశం ఉంటుందని.. ఫ్యాన్ పార్టీలో మరికొందరు నేతలు సూచిస్తున్నారు.

# ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ

విజయవాడ, మార్చి 4, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్నిల మధ్య మరోసారి రగడ మొదలయింది. దేవుడి ముందే చిల్లర తగవు పడటం మరింతగా ఇద్దరూ రాజకీయంగా దూరమయినట్లేనని చెబుతున్నారు. స్వామి వారికి సమర్పించే పట్టువస్త్రాలను అవమానించే విధంగా ప్రవర్తించారని ఇరు వర్గాలు ఆరోపించుకుంటున్నాయి. తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి.. ఎంపీ కేశినేని చిన్ని మధ్య వివాదం రేగింది. గంపలగూడెంలోని నెమలి వేణుగోపాలస్వామి కళ్యాణం సందర్భంగా పట్టువస్త్రాలు ఎవరు సమర్పించాలనే విషయంలో వివాదం తలెత్తింది. ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం.. తోపులాటజరగడంతో పోలీసులు సర్ది చెప్పి పంపాల్సి వచ్చింది.ఎంపీ కేశినేని చిన్ని పట్టువస్త్రాలు సమర్పించడానికి ప్రయత్నించగా అతని తలపై ఉన్న వస్త్రాలను కొలికపూడి శ్రీనివాసరావు లాక్కున్నారు. ఇద్దరి వ్యవహారంపై అర్చకులు సహా భక్తుల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇరువురు నేతలు గౌరవమైన పదవులలో ఉండి ఆలయంలో ఇవేం చిల్లర వేషాలు అంటూ భక్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వామి వారికి ఎవరో ఒకరు పట్టు వస్త్రాలు సమర్పించాలి కానీ, అక్కడ కూడా ఆధిపత్యం, రాజకీయాలు చేస్తే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి చిల్లర తగాదాలతో ఇద్దరూ ప్రజల్లో పలుచన అవుతున్నారన్న భావన వ్యక్తమవుతుంది. ఇరువురు ఒకేసారి ఆలయంలోకి రావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. రెండు వర్గాలకు చెందిన నేతలు తోపులాటలు ఆలయంలో చోటు చేసుకోవడం దురదృష్టకరమని అంటున్నారు. రాజకీయ నాయకులటీడీపీ అధిష్టానానికి తలనొప్పిగా ఇద్దరి వ్యవహారం మారింది. గతంలో అనేక సార్లు వీరిద్దరి మధ్య వివాదానికి చెక్ పెట్టాలని ప్రయత్నం చేసినా ఫలితం కనిపించడం లేదు. చంద్రబాబు హెచ్చరించినా ఫలితం లేదు. చంద్రబాబు మాత్రం సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా వీరిద్దరి విషయంలో ఏమీ చేయలేక పోతుందని సొంత పార్టీ నుంచి కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇటీవల ఇరువురు నేతలు సోషల్ మీడియా వేదికగా రచ్చ చేసుకోవడంతో పార్టీ పరువు బజారున పడింది. ఇప్పుడు ఏకంగా ఆలయంలోనే ఘర్షణకు దిగడంతో ఇక తిరువూరు యుద్ధంలో ఏదో నిర్ణయం తీసుకోకపోతే పార్టీ వచ్చే ఎన్నికల్లో గెలిచే అవకాశాలు లేనట్లే కనిపిస్తున్నాయి.





# హైదరాబాద్ కు గంటన్నర లోపే...

విజయవాడ, మార్చి 4, తెలంగాణ రాష్ట్రంలోని ఫ్యూచర్ సిటీ నుంచి ఏపీ రాజధాని అమరావతి మధ్య ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సమాంతరంగా అత్యాధునిక సెమీ బుల్లెట్ ట్రైన్ రానుంది. ఇది అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి అమరావతికి గంటన్నరలో దూసుకెళ్లొచ్చు. హైదరాబాద్ నుంచి చెన్నైకు కేవలం 3 నుంచి 3.30 గంటల్లోనే చేరుకోవచ్చు.మార్గంలో సెమీ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పనులు ప్రారంభానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. హైస్పీడ్ కారిడార్ అలైన్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనలతో ప్రాజెక్టు స్వరూపమే పూర్తిగా మారిపోయింది. గతంలో పేర్కొన్న రూట్‌కు బదులు ప్రస్తుతం నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పక్కనుంచే రైల్వేలైన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ప్రభుత్వం ప్రతిపాదనకు రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది. దీంతో హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నైకు వెళ్లే హైస్పీడ్ రైలుకు మిర్యాలగూడ మీదుగా సాగే కొత్త మార్గంలో ప్రాథమిక సర్వే పూర్తిచేసి, అలైన్‌మెంట్ డ్రాఫ్ట్‌ను రైల్వే బోర్డు సిద్ధం చేసింది.హైదరాబాద్ టూ చెన్నై హైస్పీడ్ రైల్వే ప్రాజెక్టు పూర్తయితే.. ఏపీ, తెలంగాణ రాజధానుల మధ్య దూరం సగానికిసగం తగ్గుతుంది. ప్రస్తుతం రైలులో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాలంటే ఐదు గంటల సమయం పడుతుంది. అదే సెమీ బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తే గంటన్నర సమయంలోనే హైదరాబాద్ నుంచి ఏపీ రాజధానికి చేరుకోవచ్చు.ఇదిలాఉంటే.. ఒకే కారిడార్‌లో రోడ్డు, రైలు మార్గాలు ఉండటం వల్ల లాజిస్టిక్స్ ఖర్చు భారీగా తగ్గుతుంది. సెమీ బుల్లెట్ ట్రైన్ గంటకు 250 కిలోమీటర్ల పైచిలుకు వేగంతో దూసుకుపోయేలా టెక్నాలజీని వినియోగిస్తారు. దీంతో ఈ కారిడార్‌ను నేరుగా చెన్నై వరకు పొడిగించడం ద్వారా హైదరాబాద్ టూ చెన్నైకు మూడు నుంచి మూడున్నర గంటల్లోనే చేరుకోవచ్చు.ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని రాబోయే ఐదేళ్లలోపు పూర్తి చేయాలని పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డీపీఆర్ పూర్తయిన వెంటనే ఏఏ గ్రామాల మీదుగా అలైన్‌మెంట్ వెళ్తుందనే కచ్చితమైన వివరాలతో త్వరలో నోటిఫికేషన్లు వెలవడే అవకాశం ఉంది.

# పెదకాకాని రైల్వే స్టేషన్‌లో దారుణం:

## వ్యక్తి గొంతు కోసి హత్య

గుంటూరు పెదకాకాని రైల్వే స్టేషన్‌లో బుధవారం ఉదయం చోటుచేసుకున్న ఒక దారుణ హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు ఒక వ్యక్తిని అతి దారుణంగా గొంతు కోసి హత్య చేశారు.?వివరాల్లోకి వెళ్తే...బుధవారం ఉదయం రైల్వే స్టేషన్ ఆవరణలో రక్తపు మడుగులో పడి ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలను సేకరించారు.?పోలీసుల దర్యాప్తు:మృతుడు అసలు ఎవరు? అతను రైల్వే ప్రయాణీకుడా లేక మరెవరైనా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. అయితే, దుండగులు వ్యక్తిని ఇక్కడే హత్య చేశారా? లేదా మరెక్కడైనా హత్య చేసి మృతదేహాన్ని స్టేషన్ ఆవరణలో పడేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.?ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

# వాస్తు ప్రకారం మెయిన్ రోడ్డు పక్కన ఉండే ఇళ్లల్లో ఉండొచ్చా?



కొంతమంది సొంత ఇళ్లు ఆ ఊరికి మెయిన్ రోడ్డు పక్కనే ఆనుకొని ఉంటాయి. అవి గ్రామాలైనా, పట్టణాలైనా, నగరాలైనా రోడ్డుకు ఇరువైపులా రణగొణ ధ్వనులు ఖాయంగా వస్తుంటాయి. అసలు మనం ఇంట్లో ఉన్నామో, రోడ్డుమీద ఉన్నామో అర్థం కాదు. ఏ మాత్రం ప్రశాంతత ఉండదు. దుమ్ము, ధూళితోపాటు అనారోగ్య సమస్యలు కూడా వస్తుంటాయి. సొంత ఇల్లు కాబట్టి ఎందుకులే.. మన ఇంట్లోనే ఉందాం అని కొందరు, మెయిన్ రోడ్డు అయినా పర్వాలేదు.. అని అద్దెకు ఉండేవారు ఉన్నారు. అయితే వాస్తు ప్రకారం మెయిన్ రోడ్డుకు పక్కన ఉండే ఇళ్లల్లో ఉండొచ్చా? లేదా? అనే వివరాలను తెలుసుకుందాం.

మెయిన్ రోడ్డు ఇంటికి ఏ దిక్కున ఉందనేది అత్యంత ముఖ్యం.

ఇల్లు మెయిన్ రోడ్డుకు దక్షిణాన ఉండి, రోడ్డు ఉత్తరం వైపు ఉన్నా పర్వాలేదు

ఇల్లు పశ్చిమాన ఉండి, రోడ్డు తూర్పు వైపు ఉన్నా అది కూడా చాలా మంచిది.

ఇలా ఉండటంవల్ల సమాజంలో పేరు వస్తుంది.. సంపద పెరుగుతుంది.

మెయిన్ రోడ్డు దక్షిణం లేదా పశ్చిమం వైపు ఉంటే

ఇంటి ప్రహరీ గోడ బరువుగా, ఎత్తుగా ఉండాలి.

ఇలా లేకపోతే కుటుంబంలో ప్రశాంతత దెబ్బతింటుంది.

మెయిన్ రోడ్డు పక్కన ఇల్లు ఉన్నప్పుడు 'వీధి పోటు' ఉందేమో చూసుకోవాలి.

రోడ్డు నేరుగా వచ్చి మీ ఇంటిని గుచ్చుతున్నట్లు ఉండకూడదు.

ఈశాన్య ఉత్తరం, ఈశాన్య తూర్పు వంటివి మంచి ఫలితాలనిస్తాయి.

నైరుతి, ఆగ్నేయం లేదా వాయువ్యం వైపు నుండి వచ్చే వీధి పోట్లు ఆర్థికంగా నష్టాలను, అనారోగ్యాన్ని కలిగిస్తాయి.

వాస్తు కేవలం దిశలకే పరిమితం కాదు, చుట్టుపక్కల వాతావరణానికి కూడా ప్రాధాన్యత ఇస్తుంది.

మెయిన్ రోడ్డుపై నిరంతరం వాహనాల శబ్దం, కాలుష్యం ఉండటం వల్ల ఇంట్లోకి సానుకూల శక్తి రాదు.

ఒకవేళ ఉన్నా అది కుదురుగా ఉండకుండా కుదువులకు లోనవుతుంది.

రోడ్డు స్థాయి కంటే ఇల్లు తక్కువ ఎత్తులో ఉండకూడదు.

రోడ్డు కంటే ఇల్లు కనీసం 2 నుంచి 3 అడుగుల ఎత్తులో ఉండాలి.

మెయిన్ రోడ్డు పక్కన ఇల్లు ఉండటం వ్యాపార పరంగా లాభదాయకం.

వాస్తు పరంగా అన్నీ సరిగ్గా ఉంటే అపారమైన ధనలాభం కలుగుతుంది.

మెయిన్ రోడ్డు పక్కనే ఉంటే, ఇంటి ముందు భాగంలో దట్టమైన చెట్లను పెంచాలి.

శబ్దాన్ని, దుమ్మును, వాస్తు దోషాలను ఇవి చాలావరకు తగ్గిస్తాయి.

రోడ్డు వైపు ఉండే గోడ బలంగా ఉండాలి. ఎత్తుగా ఉండాలి.

సౌండ్ ప్రూఫ్ కిటికీలు అమర్చుకోవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది.

ప్రధాన ద్వారం వద్ద దిష్టి బొమ్మలు లేదా వాస్తు పిరమిడ్లు ఉంచితే వ్యతిరేక శక్తి ప్రవేశించదు.

# మద్యం తాగకపోయినా లివర్ దెబ్బతింటోంది.. కారణమిదేనట..



ఇటీవలి కాలంలో మద్యం సేవించని వారిలో కూడా కాలేయ సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. ఈ సమస్యను మొదట్లోనే గుర్తించి అరికట్టడం అవసరం. కాలేయ సమస్యల లక్షణాలు ప్రారంభ దశలో స్వల్పంగా మాత్రమే కనిపిస్తాయి. దీని కారణంగా, చాలా మంది తేలికగా తీసుకుంటారు. కానీ ఇలా చేయడం ఆరోగ్యానికి మంచిది కాదు. అసలు కాలేయం దెబ్బతినడానికి కారణాలు ఏంటి? కాలేయ సమస్యలు ఎవరిలో ఎక్కువగా వస్తాయి? ఆ సమస్యలు రాకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..మద్యం తాగకుండా కూడా కాలేయం ఎలా దెబ్బతింటుందో అర్థంకాక చాలామంది ఆందోళనకు గురవుతు న్నారు. ఈ అంశంపై ఆరోగ్య నిపుణులు పలు కీలక వివరాలు చెబుతున్నారు. కాలేయ సమస్యల లక్షణాలు ప్రారంభ దశలో కొద్దిగా మాత్రమే కనిపిస్తాయి. దీని కారణంగా, చాలా మంది సమస్యను తేలికగా తీసుకుంటారు. కానీ ఇది నెమ్మదిగా శరీరంలో బలహీనత, ఆకలి లేకపోవడం, కడుపులో కుడి వైపున భారంగా అనిపించడం వంటి సమస్యలు వస్తాయి. కొంతమందికి గ్యాస్, అజీర్తి, బరువు పెరగడం వంటి వివిధ సమస్యలు ఎదురవుతాయి. చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారడం, మూత్రం ముదురు పసుపు రంగులోకి మారడం, కాళ్ళలో వాపు కూడా కాలేయం పనిచేయడం లేదని చెప్పడానికి సంకేతాలు. ఈ కారణంగా మద్యం అలవాటు లేని వారు తమ కాలేయ ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండటం అవసరం.కాలేయం దెబ్బతినడానికి కారణాలు ఏమిటి, ఎవరికి అలాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది, దానిని నివారించడానికి ఏం చేయాలి?

**కాలేయం దెబ్బతినడానికి కారణాలు..** ఆరోగ్య నిపుణుల ప్రకారం.. కాలేయం దెబ్బతినడానికి ఆల్కహాల్ మాత్రమే కారణం కాదు. సరైన ఆహారం తీసుకోకపోవడం, వేయించిన ఆహారాలు, జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంపై అదనపు భారం పడుతుంది. వ్యాయామం లేకపోవ డం, అధిక బరువు కాలేయ సమస్యలకు దారితీస్తుంది. వైద్యుడిని సంప్రదించకుండా ఎక్కువ కాలం మందులు తీసుకోవడం వల్ల కూడా కాలేయం దెబ్బతింటుంది.దీనితో పాటు, వైరల్ ఇన్ఫెక్షన్లు, కలుషితమైన నీరు లేదా ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు కూడా కాలేయాన్ని ప్రభావితం చేస్తాయి. ఒత్తిడి, క్రమరహిత దినచర్య, నిద్ర లేకపోవడం శరీర జీవక్రియను అస్థిరపరుస్తాయి. కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. కొన్నిసార్లు, కాలేయ వ్యాధులకు కుటుంబ నేపథ్యం కూడా కారణమై ఉండొచ్చు. ఇది ప్రమాదాన్ని మరింత పెంచుతుంది.

**ఎవరికి ఎక్కువ ప్రమాదం ఉంది?** అధిక బరువు ఉన్నవారు, మధుమేహం ఉన్నవారు, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. శారీరకంగా చురుకుగా లేనివారు, జంక్ ఫుడ్ క్రమం తప్పకుండా తినేవారికి కూడా కాలేయ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఎక్కువ కాలం మందులు తీసుకునేవారు, బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారు కూడా ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. కాలేయ వ్యాధి కుటుంబ నేపథ్యం ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి.

**ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..** కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల్యమైన, ఇంట్లో వండిన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. వేయించిన, ప్రాసెస్ చేసిన ఆహారాలను తినొద్దు. ప్రతిరోజూ కొంత వ్యాయామం చేయాలి. నడవాలి. పుష్కలంగా నీరు తాగాలి. సమయానికి తినాలి. వైద్యుడి సలహా లేకుండా మందులు తీసుకోవద్దు. బరువును అదుపులో ఉంచుకోవాలి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.

# ఎండా కాలంలో ఈ తప్పులు చేస్తే.. ముప్పు తప్పదు




వేసవి కాలం వచ్చేసింది.. రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే సూర్యుడి ప్రతాపం మొదలవుతోంది. ఉదయం 9 గంటలు దాటిన తర్వాత బయట కొద్ది దూరం నడిస్తే చాలు.. చెమటతో తడిసి ముద్దవుతున్నారు. వేసవి కాలంలో ఆరోగ్యం విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా తీవ్ర ప్రభావం పడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చాలా మంది తెలియకుండా చేసే చిన్న చిన్న తప్పులే ముప్పవుతాయి. అందుకే వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.



**1. మంచినీరు:**
ఎండా కాలంలో నీళ్లకు మించిన ఔషధం ఏదీ లేదని అంటారు. వీలైనంత వరకు బాడీ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలంటే ఎక్కువ నీరు తాగాలి. కనీసం రోజుకు 4 లీటర్లు మంచినీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవి కాలంలో దాహం వేసినా వేయకపోయినా గంటకోసారి గ్లాసు నీళ్లు తాగడం అలవాటు చేసుకోవాలి. బయటకు వెళ్లినప్పుడు తప్పకుండా వాటర్ బాటిల్ వెంట తీసుకెళ్లాలి.

**2. చలువ పదార్థాలు:**
వేసవి కాలంలో సబ్జా, బార్లీ గింజలు నీటిలో కలుపుకుని తాగితే శరీరానికి చల్లదనాన్ని అందిస్తాయి. రాగి అంబలి, నిమ్మ రసం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరకు రసం వంటివి రోజుకు కనీసం 2-3 సార్లు తీసుకోవాలి. ఇవి శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తాయి. బయట ఎండలో తిరిగి రాగానే ఐస్ కోల్డ్ వాటర్ లేదా ఫ్రిజ్ నీళ్లు తాగకూడదు. దీనివల్ల శరీర ఉష్ణోగ్రతలో మార్పు వస్తుంది.



**3. ఆహారపు అలవాట్లు:**
ఎండలో మసాలాలు ఎక్కువగా ఉండే ఆహారం, వేపుళ్లు, కెఫిన్(కాఫీ, టీ) ఎక్కువగా తీసుకోవడం మానుకుంటే చాలా మంచిది. సొరకాయ, బీరకాయ, పొట్లకాయ, దోసకాయ, కీరా వంటి నీటి శాతం అధికంగా ఉండే కూరగాయలు భోజనంలో చేర్చుకోవాలి. మధ్యాహ్నం భోజనంలో సాధ్యమైనంత వరకు పెరుగు లేదా మజ్జిగ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపులో చల్లగా ఉంటుంది.

**4. కళ్ల రక్షణ:**
బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా సన్‌గ్లాసెస్ ధరించాలి. కళ్లు అలసిపోయినట్లు అనిపిస్తే, చల్లటి నీటితో కళ్లను కడుక్కోవాలి. కీరా ముక్కలు కళ్లపై కొద్దిసేపు ఉంచుకుంటే రిలీఫ్‌గా ఉంటుంది. శరీరానికి వదులుగా ఉండే దుస్తులు ధరించాలి.


**5. ఎండలో వ్యాయామం వద్దు:**
ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు(ఉదయం 8 గంటల తర్వాత) ఆరుబయట వ్యాయామం చేయకూడదు. సాధ్యమైనంత వరకు తెల్లవారుజామున లేదా సాయంత్రం వేళల్లోనే వాకింగ్ లేదా వ్యాయామం చేయాలి. వేడి ఎక్కువగా ఉన్నప్పుడు బయట వ్యాయామం చేస్తే ఆరోగ్యం దెబ్బతింటుంది. పైగా డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

# వెన్ను నొప్పి మాయం కావాలంటే...

భరద్వాజాసనం: ఈ ఆసనంతో వెన్నెముక, కటి కండరాలు, ఎముకలు బలపడతాయి.

సేతుబంధనం: మెదడును నెమ్మదించి, అలసిన కళ్లకు ఉపశమనాన్నిస్తాయి.

మార్జర్యాసనం: వెన్ను, ఉదరంలోని అవయవాలు మర్దన అవుతాయి.



అథోముఖ శవాసనం: పూర్తి శరీరం ఉల్లాసభరితమవుతుంది.

అగ్నిస్థంభాసనం: సయాటిక్ నరంతో సంబంధమున్న పిరుదుల కండరాలు సాగుతాయి.

అర్థ మత్స్యేంద్రాసనం: వెన్నును బలపరిచి, ఆకలిని పెంచే అవయవాలను ప్రేరేపిస్తుంది.

అర్ధచంద్రాసనం: కాళ్లు, మడమలు బలపడతాయి.

దనురాసనం: నడుము కింది భాగం, చేతులు శక్తివంతమవుతాయి.

**వెన్ను నొప్పి మాయం!**
ఎక్కువ సమయంపాటు కూర్చునే ఉండడం, కూర్చునే భంగిమలో పొరపాట్లు, వెన్ను ముందుకు వంచి కూర్చోవడం మొదలైన అలవాట్ల వల్ల వెన్నుముకలోని పూసలు పట్టు తప్పడం, అరిగిపోవడం, తొలగడం లాంటి సమస్యలు మొదలవుతాయి. దాంతో చేతులు, కాళ్లు లాగడం, వెన్ను నొప్పి వేధిస్తాయి. ఈ తిప్పలు తప్పాలంటే సుప్తమత్స్యేంద్రాసనం సాధన చేయాలి. అదెలాగంటే...

వెల్లకిలా పడుకుని చేతులు నేల మీద చాపి ఉంచాలి.

కుడి కాలును మడిచి, ఎడమ కాలి మీదుగా శరీరం పక్కకు వంచి, నేలను తాకించాలి.

నేలను తాకిన కుడి కాలును ఎడమ చేత్తో పట్టుకోవాలి.

చేస్తున్నప్పుడు నడుము కింది భాగం మాత్రమే కదలాలి. అంతేగానీ శరీరం మొత్తం కాలుతోపాటు కదపకూడదు.

ఈ భంగిమలో అరగంటపాటు ఉండి రెండోవైపు సాధన చేయాలి.

ఆసనం పూర్తయిన తర్వాత కాళ్లు రెండు నేలకు ఆనించి పడుకుని, నెమ్మదిగా పైకి లేవాలి.

# ఆహారం.. ఆరోగ్యం

మండపేట, మార్చి3 పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు కొనసాగుతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నెలరోజులపాటు దీక్షలో ఉంటారు. తెల్లవారుజామున సహర్‌కు ముందు ఆహారం తీసుకుంటే మధ్యలో ఎలాంటి ఆహారం తీసుకోరు. మారిన పరిస్థితుల నేపథ్యంలో గంటల తరబడి ఎలాంటి ఆహారం తీసుకోకుండా ఉండటం అంటే ఇబ్బందే. ఉపవాస దీక్షలో ఉన్న వారు పగటి వేళంతా అంతే ఉత్సాహంతో కనిపించాలంటే ఉదయం, రాత్రి తీసుకునే ఆహారంతోపాటు, ఎండుఫలాలు, పండ్లు తీసుకోవటం మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇవి రోజంతా మనిషికి అలసట, నీరసం లేకుండా శక్తినిస్తాయని చెబుతున్నారు.రంజాన్ మాసంలో కేవలం ముస్లిం సోదరులే కాకుండా అందరూ కూడా కొనుగోలు చేసే విధంగా డ్రైఫ్రూట్స్‌ను వివిధ రకాల ప్యాకెట్లలో మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అలాగే ముస్లిం సోదరులకు బహుమతిగా ఇవ్వడానికి వీలుగా ఉండేలా ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లు సిద్ధం చేశారు. ప్యాకింగ్‌లో కిలో ఒక్కోరకం 200 గ్రాముల వంతున జీడిపప్పు, బాధం, పిస్తా, కిస్‌మిస్, ఖర్జూరంతో తయారు చేస్తున్నారు. అలాగే ముస్లింలు అధికంగా ఇష్టపడే సేమియాలు పట్టణాల్లోని పలు దుకాణాల్లో విక్రయిస్తున్నారు.

**జోరుగా డ్రైఫ్రూట్స్ వ్యాపారం..** మార్కెట్‌లో ఏటా డ్రైఫ్రూట్స్ వ్యాపారం జరిగినా రంజాన్‌వేళ ఈ వ్యాపారం జోరుగా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో డ్రైఫ్రూట్స్ వ్యాపారం జోరుగా సాగుతోంది. రోజూ ఉపవాసం వేళ శక్తినిచ్చే గుణం వీటిలో అధికంగా ఉండటంతో వీటి అమ్మకాలు అధికంగా ఉంటాయని డ్రైఫ్రూట్స్ వ్యాపారి నాగేశ్వరరావు చెప్పారు. సాధారణ రోజుల్లో కంటే రంజాన్‌వేళ 35శాతం అమ్మకాలు పెరిగాయని డ్రైఫ్రూట్స్ వ్యాపారులు చెబుతున్నారు. అలాగే దేశంలో ప్రధాన పట్టణాలైన ఢిల్లీ, ముంబాయితోపాటు దుబాయ్,




షార్జా, కువైట్ వంటి అరబ్ దేశాల నుంచి కూడా డ్రైఫ్రూట్స్ దిగుమతి చేసుకుంటారు. ఎండుఫలాల విషయానికి వస్తే సహర్ ఉదయం వేళ ఆహారంతోపాటు బాధం, జీడిపప్పు, పిస్తా, అంజిర్, అక్రోట్, కిస్‌మిస్ తీసుకోవటం ద్వారా రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.ఖర్జూరం, ఎండుఫలాల్లో అంత్యంత శక్తినిచ్చేది ఖర్జూరం. ఇందులో ఉండే గ్లూకోజ్ ఫ్రక్టోజ్ శరీరాన్ని ఉల్లాసపరుస్తాయి. నీళ్లలో రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే గింజలు తీసేసి తీసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు అయినా తీసుకుంటే గుండె ఎంతో పదిలంగా ఉంటుంది.. అలసట దరిచేరనివ్వదు. ఇందులో కొద్దిపాళ్లలో ఉన్న నికోటిన్ పేగుల్లోని ఇబ్బందులను తొలగిస్తోంది. అధిక రక్తపోటు ఉన్నవారు ఎక్కువగా తింటే తగినంత పోటాషియం లభిస్తోంది. బీపీని కూడా నియంత్రిస్తుంది. 100 గ్రాముల ఖర్జూరంలో 7.3శాతం ఐరన్ ఉంటుంది. 94 క్యాలరీల శక్తి, 1.8 గ్రాముల పొటాషియం, 55గ్రాముల కార్బోహైడ్రేట్లు, 0.5 గ్రాముల కొవ్వు, 7 గ్రాముల పీచు పదార్థం. 60 గ్రాముల పొటాషియంతోపాటు విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అందుకే ఎండు ఖర్జూరమైతే 317 క్యాలరీల శక్తి ఉంటుంది.పిస్తా పప్పులో 567 క్యాలరీల శక్తి, 27 గ్రాముల కార్బోహైడ్రేట్స్ ఉన్నాయి. 20 గ్రాముల ప్రోటీన్లు ఉన్నాయి.జీడిపప్పులో ప్రోటీన్లు, ఫైబర్ అధికంగా ఉంటాయి. శరీరానికి శక్తినిచ్చే గుణాలు అధికంగా ఉంటాయి. గుండెకు శక్తిని ఇవ్వటమే కాకుండా కంటిచూపును కూడా మెరుగుపరుస్తోంది. ఇందులో పొటాషియం, పాస్పరస్ విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. రోజుకు పదికన్నా ఎక్కువగా తినకూడదు. 100 గ్రాముల జీడిపప్పులో 250 క్యాలరీల శక్తి, 4.0శాతం ప్రోటీన్లు, 1.9శాతం ఐరన్ ఉంటాయి.ప్రోటిన్స్ అందించే వాల్‌నట్స్‌ను తింటే అధికంగా లభించే అరుదైన ఒమెగా 3ప్యాటీ అసిడ్స్ లభిస్తాయి.విటమిన్ ఇ ఫైబర్ కూడా శరీరానికి అవసరమైన పోషకాలు ఎన్నో వీటిలో ఉన్నాయి. రోజుకు రెండు మూడు వాల్‌నట్స్ తినవచ్చు.కిస్‌మిస్ తినేముందు మధురంగా రుచిగా ఉండే కిస్‌మిస్‌లో ఎనలేని ప్రయోజనాలు ఉన్నాయి. రక్తాన్ని శుద్ధి చేయటమే కాకుండా జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తాయి. శక్తినిస్తాయి. రాత్రివేళల్లో ఒక గ్లాస్‌లో నానబెట్టి ఉదయాన్నే తాగితే కడుపు శుభ్రం అవుతుంది. 100 గ్రాముల కిస్‌మిస్‌లో 209 క్యాలరీల శక్తి ఉంటుంది. ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్స్ తగిన స్థాయిలో ఉంటాయి.బాదంలో అధికంగా పోషకాలు ఉంటాయి.




# స్పోర్ట్స్ న్యూస్

## వన్డే ప్రపంచ కప్ 2027: రో-కో కోసం కివీస్ పర్యటనలో మార్పులు!



టీ20 ప్రపంచ కప్ 2026 ముగిసిన తర్వాత బీసీసీఐ తన దృష్టిని మొత్తం 2027లో జరగనున్న వన్డే ప్రపంచ కప్ వైపు మళ్లించనుంది. టీమిండియా వెటరన్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే టెస్ట్, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికి వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న విషయం తెలిసిందే. రానున్న వన్డే వరల్డ్ కప్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ వీరిద్దరి కోసం ఓ కీలక ప్రణాళిక సిద్ధం చేసినట్లు వార్తలు వస్తున్నాయి.ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో టీమిండియా న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. షెడ్యూల్ ప్రకారం అక్కడ ఐదు టీ20లు, రెండు వన్డేలు, రెండు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. అయితే టీ20 సిరీస్‌ను తగ్గించి.. వన్డే సిరీస్‌లో అదనంగా రెండు మ్యాచ్‌లు పెంచే అవకాశం ఉన్నట్లు సమాచారం. వన్డే ప్రపంచ కప్ సమీపిస్తోన్న తరుణంలో రోహిత్, విరాట్ కోసం బీసీసీఐ ఈ మార్పు చేయనుందని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.ఈ ప్రతిపాదనను న్యూజిలాండ్ క్రికెట్ బోర్డే బీసీసీఐకి పంపినట్లు తెలుస్తోంది. వన్డే మ్యాచ్‌లు పెరిగితే రోహిత్, విరాట్ లాంటి స్టార్ ప్లేయర్లు ఎక్కువగా మైదానంలో ఉండే అవకాశం ఉంటుంది. దీంతో టీవీ రేటింగ్స్, స్పాన్సర్ల ఆదాయం కూడా పెరుగుతుందని న్యూజిలాండ్ భావిస్తోంది. ఈ ప్రతిపాదనకు బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. అయితే ఈ అంశంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా త్వరలోనే కొత్త షెడ్యూల్‌ను ఖరారు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ఏడాది టీమిండియా.. జూన్‌లో అఫ్ఘనిస్తాన్, జులైలో ఇంగ్లండ్, ఆ తర్వాత వెస్టిండీస్, ఏడాది చివరిలో శ్రీలంక జట్లతో వన్డే సిరీస్‌లు ఆడనుంది. సిరీస్‌లన్నీ వరల్డ్ కప్‌నకు సన్నాహకంగా ఉపయోగపడనున్నాయి.

## ఐపీఎల్ 2026: చిన్నస్వామి స్టేడియంలోనే ఫైనల్ పోరు




ఐపీఎల్ 2026 సందడి మరికొద్దిరోజుల్లో ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నీకి సంబంధించి వేదికలపై ప్రస్తుతం చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఓ క్రేజీ న్యూస్ వెలుగులోకి వచ్చింది. ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగనుంది. ఈ విషయాన్ని కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్ మేనన్ తాజాగా ధ్రువీకరించారు. కాగా ఆర్సీబీ 5 మ్యాచ్‌లను తన హోం గ్రౌండ్ అయిన చిన్నస్వామిలోనే ఆడనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.'రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు చిన్నస్వామి స్టేడియంలో ఐదు మ్యాచ్‌లు ఆడనుంది. అలాగే ఓ ప్లే ఆఫ్ మ్యాచ్‌తో పాటు, ఫైనల్ మ్యాచ్ కూడా ఈ మైదానంలోనే జరగనుంది. వీటికి సంబంధించిన తేదీలను త్వరలోనే ప్రకటిస్తాం. షెడ్యూల్‌ను బీసీసీఐ అతి త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉంది. చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ గర్జన మరోసారి ప్రతిధ్వనించనుంది' అని సంతోష్ మేనన్ వెల్లడించాడు.ర్సీబీ చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్ ఆడటంపై ఆ ఫ్రాంచైజీ సీఈఓ రాజేశ్ మేనన్ స్పందించారు. 'చిన్నస్వామి స్టేడియం మాకు హోం గ్రౌండ్ కంటే ఎక్కువ. ఇది మా ఉనికి. బెంగళూరు అభిమానుల ఉత్సాహమే మా ఆటగాళ్లకు ఇంధనం. ప్రతి దశలోనూ వారు క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలిచారు. మా ఫ్యాన్స్ మాకు మద్దతు తెలిపారు. వారి అభిమాన జట్టు బెంగళూరులో ఆడటాన్ని చూసేందుకు వారు పూర్తి అర్హులు' రాజేశ్ మేనన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీకి జరిమానా.. ఎందుకంటే.?

స్పోర్ట్స్ డెస్క్: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ గురించి క్రికెట్ అభిమానులకు ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. తనదైన సారథ్యంలో భారత జట్టుకు పలు ఐసీసీ ట్రోఫీలను అందించాడు. క్రికెట్ కెరీర్‌లోనే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ మిస్టర్ కూల్ వివాదాలకు చాలా దూరంగా ఉంటాడు. అలానే నియమ నిబంధనలను తుచ తప్పకుండా పాటిస్తాడు. అలాంటి ఎంఎస్ ధోనీకి ఓ విషయంలో జరిమానా పడింది. మరి.. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.ఎంఎస్ ధోనీ.. ట్రాఫిక్ నిబంధనను ఉల్లంఘించి వార్తల్లోకెక్కాడు. కొద్దిరోజుల కిందట అతని పేరిట రిజిస్టర్ అయిన ఓ వాహనం రాంచీలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు రికార్డైంది. ఆ వాహనం వేగపరిమితిని మించి ప్రయాణించినట్లు ఆటోమేటెడ్ ట్రాఫిక్ మానిటరింగ్ సిస్టమ్(ఐటీఎంఎస్) గుర్తించింది. దీంతో మోటార్ వెహికిల్స్ యాక్ట్ సెక్షన్ 183 కింద రూ.1000 జరిమానా విధిస్తూ ట్రాఫిక్ పోలీసులు ఈ-చలాన్ జారీ చేశారు. ఈ నిబంధన ఉల్లంఘించిన ఘటన ధోనీ నివాస సమీపంలోనే జరిగినట్టు తెలుస్తోంది.ఇలాంటి ఘటనలు సర్వసాధారణమే అయినా.. ధోనీ పేరు రావడంతో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ జరిమానా కంటే ముందే ధోనీ మరో వివాదంలో వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. రాంచీలోని హర్ము రోడ్‌లో ఉన్న ఆయన పాత నివాస స్థలాన్ని వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించారని ఆరోపణలు రావడంతో.. జార్ఖండ్ స్టేట్ హౌసింగ్ బోర్డ్ నోటీసులు జారీ చేసింది. ఆ స్థలం కేవలం నివాస ప్రయోజనాల కోసం మాత్రమే కేటాయించారని అధికారులు పేర్కొన్నారు.ఈ వివాదల నడుమ ధోనీ ప్రస్తుతం ఐపీఎల్ 2026 సన్నాహకాల్లో బిజీగా ఉన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ ఈ సీజన్‌కు కూడా ధోనీని రిటైన్ చేసుకుంది. అన్‌క్యాప్డ్ ప్లేయర్ కోటాలో రూ.4 కోట్లకు అతను ఎంపికయ్యాడు. గత సీజన్‌లో సీఎస్‌కే 14 మ్యాచ్‌ల్లో 10 ఓటములు ఎదుర్కొని చివరి స్థానంలో నిలిచింది. అయితే ధోనీ వ్యక్తిగతంగా 135.17 స్ట్రైక్ రేట్‌తో 196 పరుగులతో రాణించాడు. ధోనీ(44)కి వయసు మీదపడినప్పటికీ.. అతడి వ్యూహాత్మక అవగాహన, జట్టుపై నియంత్రణ సీఎస్కేకు కీలకంగా మారనున్నాయి. సంజూ శాంసన్ లాంటి కీలక ఆటగాళ్లను జట్టులో చేర్చుకోవడంలోనూ ధోనీయే కీలకపాత్ర పోషించాడని క్రీడా నిపుణులు అంటున్నారు.




## టీ20 ప్రపంచ కప్ వ్యూయర్ షిప్‌లో సంచలన రికార్డ్!




టీ20 ప్రపంచ కప్ 2026 ముగింపు దశకు చేరుకుంది. నేటి నుంచి సెమీ ఫైనల్ పోరు జరగనుంది. అయితే ఈ పోట్టి ప్రపంచ కప్ వ్యూయర్‌షిప్ పరంగా రికార్డు సృష్టిస్తోంది. ఇప్పటి వరకు భారత్‌లో దాదాపు 50 కోట్ల మంది ఈ టోర్నీలో జరిగిన మ్యాచులను వీక్షించినట్లు ఐసీసీ ఛైర్మన్ జై షా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో ఇదే రికార్డని వెల్లడించారు.'ప్రస్తుత టీ20 ప్రపంచ కప్ 2026ను అత్యంత ప్రేక్షకాదరణ పొందిన ఈవెంట్‌గా మార్చాలనే ఆశయంతో ప్రారంభించాం. భారతదేశంలో ఈ ఈవెంట్‌కు వీక్షకుల సంఖ్య 50 కోట్లు(500 మిలియన్లు) దాటింది. ఇది టీ20 ప్రపంచ కప్ చరిత్రలోనే అత్యధికం. జియో హాట్ స్టార్ వీక్షకుల సంఖ్య 6.05కోట్లకు (60.5 మిలియన్లు) చేరుకుంది. ఈరోజు నుంచి నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. వీటిని కూడా భారత అభిమానులు వీక్షించి.. మరిన్ని రికార్డులు బద్దలు కొట్టాలని ఆశిస్తున్నాం అని జై షా ఎక్స్‌లో పేర్కొన్నారు.ఇదిలా ఉండగా.. నేటి నుంచి సెమీ ఫైనల్ పోరు ప్రారంభం కానుంది. బుధవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికా-న్యూజిలాండ్ మధ్య సెమీ ఫైనల్ 1 మ్యాచ్ జరగనుంది. అలాగే మార్చి 5 (గురువారం) ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా భారత్-ఇంగ్లండ్ సెమీ ఫైనల్స్ 2లో తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌ల్లో గెలిచిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటాయి. మార్చి 8 (ఆదివారం) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనున్న విషయం తెలిసిందే.

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్: అగ్రస్థానంలోనే కొనసాగుతున్న అభిషేక్ శర్మ




టీ20 ప్రపంచ కప్ 2026 సమరం రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే సూపర్ 8 నుంచి నాలుగు జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. తొలి సెమీ ఫైనల్ మ్యాచ్ నేడు ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికా-న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనుంది. ఈ నేపథ్యంలో ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్ జాబితాను విడుదల చేసింది. ఈ మెగా టోర్నీ ఆరంభం నాటి విఫలమవుతూ వస్తున్నప్పటికీ.. టీమిండియా స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ 874 పాయింట్లతో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు.జింబాబ్వేపై హాఫ్ సెంచరీ మినహా అభిషేక్ ఈ టోర్నీలో పరుగులు రాబట్టలేకపోయాడు. భారీ అంచనాలతో బరిలోకి దిగి వరుసగా మూడు డకౌట్లు, ఓ మ్యాచ్‌లో 15 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా నిరాశపర్చాడు. కాగా పాకిస్థాన్ బ్యాటర్ ఫర్హాన్ ఈ టోర్నీలో రెండు సెంచరీలు చేసి 848 పాయింట్లతో రెండో స్థానానికి దూసుకొచ్చాడు. అభిషేక్ శర్మ ఫామ్ అందుకుని పరుగులు చేయలేకపోతే.. తన స్థానాన్ని కోల్పోవడం ఖాయమే. కాగా పొట్టి ప్రపంచ కప్ టోర్నీలో అద్భుత ప్రదర్శనలు చేసిన ఇషాన్ కిషన్(783).. 15వ స్థానం నుంచి ఒకేసారి నాలుగో స్థానానికి దూసుకొచ్చాడు. తిలక్ వర్మ(749), కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్(739) ఐదు, ఆరో స్థానాల్లో కొనసాగుతున్నారు.ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ బౌలింగ్ జాబితాలో టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 771 పాయింట్లతో తన అగ్రస్థానాన్ని పదిలపర్చుకున్నాడు. ప్రపంచ కప్ ఆఖరి రెండు మ్యాచుల్లో కాస్త పరుగులు సమర్పించుకున్నప్పటికీ.. వికెట్లు తీసుకున్నాడు. దీంతో తన స్థానం పదిలంగా ఉంది. రెండో స్థానంలో అఫ్ఘనిస్తాన్ బౌలర్ రషీద్ ఖాన్ 753 పాయింట్లతో ఉన్నాడు. పాకిస్థాన్ ప్లేయర్ అబ్రార్ అహ్మద్(736) మూడో స్థానానికి దూసుకొచ్చాడు. బుమ్రా(671) ఏడో స్థానంలో ఉండగా.. అర్ష్‌దీప్ సింగ్(653) 13వ స్థానంలో కొనసాగుతున్నారు. ఇక ఆల్‌రౌండర్ జాబితాలో జింబాబ్వే కెప్టెన్‌సికందర్ రజా(328) అగ్రస్థానంలో ఉన్నాడు. టీమిండియా స్టార్ హార్దిక్ పాండ్య 284 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకాడు.

## ఇషాన్ కిషన్‌తో ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేయించాలి: రవిశాస్త్రి

టీ20 ప్రపంచ కప్(లో భాగంగా ముంబై వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య హై హోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఇదే సమయంలో టీమిండియా టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచుల్లో కేవలం 80 పరుగులు మాత్రమే చేశాడు. జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో మాత్రమే అతడు బ్యాట్‌తో అర్ధ సెంచరీతో రాణించాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి కీలక సూచనలు చేశాడు. ఇషాన్ కిషన్‌తో ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేయించాలని, తుదిజట్టులో రింకు సింగ్‌ను తీసుకోవాలని అన్నాడు.ఐసీసీ రివ్యూలో రవిశాస్త్రి మాట్లాడుతూ... గురువారం ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌కు అభిషేక్ శర్మను కొనసాగించాలని, మానసికంగా ఇబ్బందిపడుతుండటం వల్లే అతడు పెద్దగా స్కోర్లు చేయలేకపోతున్నాడని అన్నాడు. గతంలో అభిషేక్ ఇంగ్లండ్ సిరీస్‌లో అద్భుతంగా రాణించన సంగతి మనందరం గుర్తు చేసుకోవాలని తెలిపాడు. అతడు సెమీ ఫైనల్‌లో రాణిస్తాడనే నమ్మకం తనకు ఉందని రవిశాస్త్రి వెల్లడించాడు. అలానే ఇషాన్ కిషన్‌తో ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేయించాలని, అలాగే తుది జట్టులోకి రింకు సింగ్‌ను తీసుకుని లోయర్ ఆర్డర్‌లో అతడికి అవకాశం ఇవ్వాలని రవిశాస్త్రి సూచించాడు. ఇషాన్ కిషన్, సంజు శాంసన్ కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించాలని ఆయన తెలిపాడు.గతేడాది ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌తో జరిగిన 5 టీ20 మ్యాచ్‌లో సిరీస్‌లో అభిషేక్ శర్మ భారీ సెంచరీ (135) బాదాడు. అలాగే టీ20ల్లో భారత క్రికెటర్లలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నీ ప్రారంభానికి ముందు సూపర్ ఫామ్‌లో ఉన్న ఈ యువ హిట్టర్.. అనూహ్యంగా ఈ ఐసీసీ టోర్నీలో విఫలమవుతూ వస్తున్నాడు. ఇదే సమయంలో మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ ఏడు మ్యాచులు ఆడి.. 224 పరుగులు చేశాడు. సూపర్-8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో సంజు శాంసన్ 97 పరుగులతో అజేయంగా నిలిచాడు.






# అల్లూ వారింట పెళ్లి బాజాలు

## ఘనంగా శిరీష్ ప్రీవెడ్డింగ్ రిసెప్షన్



అల్లూ వారింట పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సోదరుడు అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. తన ప్రేయసి నయనికా రెడ్డితో ఈ నెల 6న శిరీష్ వివాహం ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా అల్లూ కుటుంబం హైదరాబాద్‌లోని అల్లూ స్టూడియోస్‌లో భారీ స్థాయిలో ప్రీ–వెడ్డింగ్ రిసెప్షన్‌ను నిర్వహించింది. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇండస్ట్రీ నుంచి నందమూరి బాలకృష్ణ, అక్కినేని నాగార్జున, రామ్ చరణ్, మోహన్ బాబు, నాని, నాగచైతన్య, గోపీచంద్, బ్రహ్మానందం, రాజేంద్ర ప్రసాద్ హాజరయ్యారు. దర్శకుల్లో కె. రాఘవేంద్రరావు, అట్లీ, వి.వి. వినాయక్ పాల్గొన్నారు. ప్రముఖ నిర్మాత అశ్వనీ దత్ కూడా ఈ వేడుకలో కనిపించారు. రాజకీయ వర్గాల నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి, ఏపీ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. అయితే ఈ కార్యక్రమంలో మలయాళ నటుడు, దర్శకుడు బాసిల్ జోసెఫ్ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. టొవినో థామస్ హీరోగా తెరకెక్కించిన సూపర్ హీరో చిత్రం మిన్నల్ మురళితో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బాసిల్ జోసెఫ్ ఈ వేడుకలో కనిపించడంతో ఇండస్ట్రీ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. ఇటీవల అల్లు అర్జున్ హీరోగా బాసిల్ జోసెఫ్ ఓ సూపర్ హీరో కథను తెరకెక్కించబోతున్నారన్న వార్తలు వినిపించిన విషయం




తెలిసిందే. 'శక్తిమాన్' పేరుతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ సిద్ధమవుతోందని ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తల్లో నిజం లేదని బాసిల్ గతంలో స్పష్టం చేశారు. అయినప్పటికీ శిరీష్ ప్రీ–వెడ్డింగ్ వేడుకలో బన్నీ స్వయంగా బాసిల్‌ను అందరికీ పరిచయం చేయడం మళ్లీ ఆ ప్రాజెక్ట్‌పై ఊహాగానాలకు తెరలేపింది. ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్ ప్రకారం, బన్నీ?బాసిల్ జోసెఫ్ కాంబినేషన్‌లో ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు మళ్లీ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ రెండు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఒకటి అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ హీరో పాన్ వరల్డ్ చిత్రం కాగా, మరొకటి లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్టైనర్. ముఖ్యంగా అట్లీతో చేస్తున్న పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ షూటింగ్ శరవేగంగా సాగుతోంది.




# పెద్ది సినిమా రన్‌టైమ్‌పై ఊహాగానాలు

## ఆ వార్తలను కొట్టి పారేసిన చిత్రబృందం



ప్రస్తుతం టాలీవుడ్‌లో భారీ నిడివి గల సినిమాల ట్రెండ్ నడుస్తోంది. కంటెంట్ బలంగా ఉంటే మూడు గంటలకు పైగా రన్ టైం ఉన్నా ప్రేక్షకులు ఆదరిస్తారని రీసెంట్‌గా 'పుష్ప 2' నిరూపించింది. ఈ క్రమంలోనే సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమా కూడా 3 గంటల కంటే ఎక్కువ నిడివితో ఉండబోతోందని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. సినిమా రఫ్ కట్ ఏకంగా 4 గంటలకు పైగా వచ్చిందని, ఎడిటింగ్ తర్వాత కూడా అది 3 గంటల పైనే ఉంటుందని ప్రచారం జరిగింది.అయితే, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని చిత్ర వర్గాలు కొట్టిపారేశాయి. సినిమా నిడివి గురించి వస్తున్నవన్నీ ఊహాగానాలేనని, అభిమానులు వీటిని నమ్మాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. షూటింగ్ దశలో ఉన్న సినిమా రన్ టైం గురించి ఇప్పుడే మాట్లాడటం సరికాదని, దర్శకుడు బుచ్చిబాబు ఒక పక్కా ప్లానింగ్‌తో సినిమాను




రూపొందిస్తున్నారని తెలిపారు. ఒక ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ఆడియన్స్‌కు బోర్ కొట్టకుండా సరైన నిడివితోనే వస్తుందని భరోసా ఇచ్చారు. వృద్ధి సినిమాస్ పతాకంపై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై నేషనల్ లెవెల్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. చరణ్ ఒక విభిన్నమైన లుక్‌లో కనిపిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.

# 5న వృషకర్మ గ్లింప్స్ విడుదల

అక్కినేని నాగచైతన్య హీరోగా, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'వృషకర్మ'. 'విరూపాక్ష' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత దర్శకుడు కార్తీక్ వర్మ దండు తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో దీనిపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన




పవర్‌ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సిద్ధమైంది. ఈ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌ను అత్యంత గ్రాండ్‌గా నిర్వహించేందుకు మేకర్స్ ఒక ఆసక్తికరమైన వేదికను ఎంచుకున్నారు. ఈ నెల 5న విడుదల కానున్న 'వృషకర్మ' గ్లింప్స్‌ను హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పి సి ఎక్స్ స్క్రీన్‌పై ప్రదర్శించనున్నారు.గురువారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. కేవలం మీడియా ప్రతినిధులు మాత్రమే కాకుండా, పెద్ద సంఖ్యలో అక్కినేని అభిమానులు కూడా ఈ ఈవెంట్‌కు హాజరుకానున్నారు. ఈ సినిమాకు 'కాంతార' ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. సీనియర్ నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ గ్లింప్స్ చైతు కెరీర్‌లోనే ఒక కొత్త మైలురాయిగా నిలుస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.




# థియేటర్లలో ఈ వారం పలు కొత్త సినిమాలు







ఈ వారం థియేటర్లలో పలు సినిమాలు విడుదలవుతున్నాయి. శ్రీవిష్ణు కథానాయకుడిగా నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'మృత్యుంజయ్'. శ్రీ హుసేన్ షా కిరణ్ దర్శకుడు. రెబా మోనికా జాన్ కీలక పాత్ర పోషించింది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ మార్చి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఉత్కంఠ రేకెత్తించే కథ, కథనాలతో ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది. పాటలు, వినోదం లేకుండా సాగే అచ్చమైన క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించినట్లు చిత్ర బృందం తెలిపింది.ఇకపోతే 'ఈ చిత్రం నవ్విస్తుంది, భయపెడుతుంది. చివరివరకూ ఉత్కంఠభరితంగా సాగుతుంది' అంటున్నారు శివాజీ. ఆయన కీలక పాత్రలో ఈటీవీ విన్ ఒరిజినల్ మూవీగా రూపొందిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. లయ కథానాయిక. ఈ మూవీలో అలీ, ధనరాజ్, రోహన్, బబ్లూ, చిత్రం శ్రీను, కమల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తొలుత ఈ మూవీని నేరుగా ఈటీవీ విన్ ఓటీటీ వేదికగా విడుదల చేయాలనుకున్నారు. కానీ, బలమైన కంటెంట్ కావడంతో థియేటర్‌కు తీసుకొస్తున్నారు. మార్చి 6న ఈ మూవీ విడుదల కానుంది.తెలుగు ప్రేక్షకులను అలరించడానికి మరో వినోదాత్మక కథ సిద్ధమైంది. శ్రీనాథ్ మాగంటి కథానాయకుడిగా బాల సతీశ్ దర్శకత్వంలో రూపొందుతున్న కామెడీ విలేజ్ డ్రామా 'మెన్షన్ హౌస్ మల్లేష్'. గ్రాయంత్రి రమణ కథానాయిక. కనకమేడల ప్రొడక్షన్స్ పతాకంపై రాజేష్ నిర్మించారు. మార్చి 6న ఈమూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. కొత్తగా పెళ్లయిన మల్లేష్ అనే యువకుడికి శోభనం రోజు రాత్రి అతడి భార్య ఇచ్చిన షాక్ ఏంటి? దాని నుంచి అతడు ఎలా బయటపడ్డాడు?మల్లేష్‌కు ఊళ్లో ఉన్న పంచాయతీలు ఏంటి? అన్నది వినోదాత్మకంగా తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.ప్రముఖ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'సరస్వతి' ఈటీవీ విన్ నవంర్పిస్తోంది. ప్రియమణి, ప్రకాశ్‌రాజ్ తదితరులు కీలక పాత్రల్ని పోషించారు.



హై కాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం మార్చి 6న ప్రేక్షకుల ముందుకొస్తోంది. 'మహిళా ప్రధానమైన సినిమా అని సందేశం ఇచ్చినట్టుగా ఉండదు ఈ చిత్రం. థ్రిల్లింగ్‌గా సాగుతూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుంది' అని చిత్ర బృందం చెబుతోంది.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**